
Follow: @ANNTELUGU
20-07-2026
ANN తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 197 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## నేటి నుండి పార్లమెంట్ సమావేశాలు


- నేటి నుండి పార్లమెంట్ సమావేశాలు
- 8 బిల్లులతో కేంద్రం రెడీ
- నీట్, అయోధ్య అంశాలపై పోరుకు విపక్షాలు సిద్ధం
- అఖిలపక్ష సమావేశంలో రగడ.. వాకౌట్

ఢిల్లీ, మహా : పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి అత్యంత వాడీవేడిగా ప్రారంభం కానున్నాయి. ఆగస్టు 13 వరకు సాగనున్న ఈ సమావేశాల్లో ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వం ఎనిమిది కీలక బిల్లులను సిద్ధం చేసింది. ఇందులో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న రెండు బిల్లులను సోమవారమే సభ ముందుకు తీసుకురానుండటం తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను ప్రస్తుతమున్న 33 నుంచి 37కు పెంచుతూ రూపొందించిన బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రతిష్ఠాత్మకంగా

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

### అభిమానులకు మెగాస్టార్ చిరంజీవి కానుక



- రూ.5 లక్షల ఆరోగ్య బీమా పథకం.
- 22న చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రారంభం

02

### గిరిజనులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్



- రూ.కోటితో అభివృద్ధి పనులు పూర్తి

03

### స్థానిక సంస్థల ఎన్నికలపై చంద్రబాబు ఫోకస్



- పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం.
- అభ్యర్థుల ఖరారు అధిష్ఠానానిదే

02

ఆగస్టు 3 వరకు

# గాంధీభవన్‌కు రావొద్దు

## సెగ్మెంట్లలోనే ఉండాలి

- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరిక
- నేతలకు సీఎం రేవంత్ వార్నింగ్
- ఎన్నికల ప్రచారం తరహాలో యుద్ధప్రాతిపదికన పనిచేయాలి
- పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీలు తమ ఇన్ ఛార్జిస్థానాల్లో పర్యవేక్షించాలి



హైదరాబాద్, మహా : తెలంగాణ కాంగ్రెస్ నేతలకు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లకు సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. జులై 19న శనివారం నిర్వహించిన ప్రత్యేక జూమ్ సమావేశంలో పార్టీ ముఖ్య నేతలతో మాట్లాడిన సీఎం.. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రతి ఒక్కరూ సీరియస్‌గా దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించిన నేపథ్యంలో.. అప్పటి వరకు కాంగ్రెస్ నేతలెవరూ గాంధీభవన్‌కు రావొద్దని ఆదేశాలు జారీ చేశారు. గాంధీభవన్ చుట్టూ తిరిగితే పదవులు రావని.. కేవలం క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసే వారికే గుర్తింపు ఉంటుందని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ఛైర్మన్ పదవులు, పార్టీ పోస్టుల కోసం గాంధీభవన్ చుట్టూ తిరిగేవారికి నియామకాలు ఉండవన్నారు. హైదరాబాద్‌కే పరిమితమైతే కుదరదని.. నేతలంతా క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజల్లో ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎస్ఐఆర్ పనుల్లో నిర్లక్ష్యం వహించే ఇన్‌చార్జ్‌లపై

మిగతా 2వ పేజీలో

## అచ్చంపేట, ఆదిలాబాద్ టాప్

- ఏ-కేటగిరిలో 42 నియోజకవర్గాలు
- సీ,డీ కేటగిరీల నేతలు పనితీరు మెరుగుపరుచుకోవాలన్న సీఎం
- డి-కేటగిరిలో నిర్మల్, సీ-కేటగిరిలో ఆసిఫాబాద్, ఖానాపూర్

02

# అన్నోజిగూడలో అరాచకం



## మాజీ రౌడీషీటర్ బరితెగింపు

- 25 మంది బౌన్సర్లతో హల్‌చల్!
- ప్లాట్ల యజమానులను భయభ్రాంతులకు గురి చేస్తున్న వైనం!
- నిర్మాణంలో ఉన్న ప్రహారీని కూల్చి కబ్జాకు యత్నం!
- కేసు నమోదు చేసిన పోలీసులు.. రెండు నెలలుగా పరారీ లో బాలరాజ్ గౌడ్
- స్టేషన్ బెయిల్ తో బయటికి వచ్చి ప్లాట్ల యజమానులకు బెదిరింపులు !
- మాకు రక్షణ కల్పించాలంటూ పోలీస్ కమీషనర్ కి విన్నపం!
- మళ్ళీ రౌడీషీట్ తెరవాలని స్థానికుల విజ్ఞప్తి!
- బ్యాంకులకు కుచ్చుటోపీ.. వంద కోట్లను కొల్లగొట్టిన అక్రమార్కులు



ఘట్కేసర్ మండలం అన్నోజిగూడలో భూ వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీస్తుంది. బాలగోని బాలరాజ్ గౌడ్ అనే ఓ మాజీ రౌడీషీటర్ అరాచకం రోజు రోజుకు పేట్రేగి పోతుంది. 25 మంది ప్రైవేట్ బౌన్సర్లను నియమించుకుని అన్నోజిగూడ ప్రాంతంలో హల్‌చల్ సృష్టిస్తూ స్థానిక ప్లాట్ల యజమానులను, రైతులను భయభ్రాంతులకు గురి చేస్తూ అరాచకాన్ని సృష్టిస్తున్నాడు. నిర్మాణంలో ఉన్న ప్రహారి గోడలను అర్ధరాత్రి వేల తన ప్రైవేట్ సైన్యం ద్వారా జేసీబీ లతో కూల్చివేసి ప్లాట్లను కాజేసేందుకు కుయుక్తులు పన్నాడు. ఈ ఘటనపై ప్లాట్ల యజమానుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ, రెండు నెల్లలు పరారీలో ఉండి... తదుపరి స్టేషన్ బెయిల్‌పై బయటకు వచ్చిన సదరు మాజీ రౌడీ షీటర్ మళ్లీ బాధితులను బెదిరిస్తూ భయందోళనలకు గురి చేస్తున్నాడని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 188 మంది ప్లాట్ల యజమానులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కు బిక్కు మంటూ కాలం వెళ్ళదీస్తున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితులు చేయి దాటక ముందే పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి సదరు మాజీ రౌడీ షీటర్ పై చట్ట పరమైన చర్యలు తీసుకుంటూ తమకు ప్రాణ, ఆస్తి రక్షణ కల్పించాలని బాధితులు వేడుకుంటున్నారు. అనంతరం మహా ప్రతినిధితో మాట్లాడుతూ ఈ విషయం పై పోలీస్ కమిషనర్, హైడ్రా కమిషనర్ లను కలసి వినతి పత్రాలు అందజేయనున్నట్లు వారు వెల్లడించారు.

02

# వర్షాభావంపై సీఎం అలర్ట్

- వర్షా భావ పర్యవేక్షణకు 10 జిల్లాలకు ప్రత్యేక ఐఏఎస్ అధికారులు
- జులై 20 నుంచి జిల్లాల్లో ప్రత్యక్ష పర్యటనలు ప్రారంభం
- తాగునీరు, పంటలు, విద్యుత్‌పై సమగ్ర సమీక్ష
- జిల్లాల నివేదికల ఆధారంగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు
- త్వరలో సీఎం రేవంత్‌తో రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశం

03



### న్యూయార్క్ లో అడుగుపెడితే నెతన్యాహు అరెస్ట్?

- మేయర్ సంచలన వ్యాఖ్యలపై ఇజ్రాయెల్ ఫైర్

02






### ఆర్టీసీ రాయితీ మాయాజాలం
## జర్నలిస్టుల జేబులకు చిల్లు

- 1/3 రాయితీకి మంగళం..
- సగం ధరకంటే ఎక్కువే వసూలు
- ఎక్స్‌ప్రెస్‌లో 55శాతం, ఎలక్ట్రిక్ బస్సుల్లో 60శాతం బాదుడు
- బస్సు పాస్‌లో ఒకటి.. టికెట్ మిషన్‌లో మరొకటి
- సాఫ్ట్‌వేర్ సాకుతో అదనపు వసూళ్లు.. బెంబేలెత్తుతున్న విలేకరులు

02





# అన్నోజిగూడలో అరాచకం

**మహా, స్టేట్ బ్యూరో చీఫ్ :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఘట్కేసర్ సర్కిల్, అన్నోజిగూడ గ్రామంలో నెలకొన్న ఓ భూ వివాదం ఇప్పుడు కేవలం సాధారణ సివిల్ వివాదానికే పరిమితం కాకుండా, స్థానికంగా తీవ్ర శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా మారుతోందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అన్నోజిగూడ సర్వే నంబర్లు 61, 68, 71, 72, 73, 74, 75, 77, 78, 79, 81, 82, 83లలో మొత్తం 86.10 భూమి ఉన్నట్లు రెవిన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. వివరాలలోకి వెళితే ఈ భూములు అల్వాల బాగయ్య, అల్వాల కృష్ణయ్య, అల్వాల రాజలింగం అనే ముగ్గురు అన్నదమ్ములతో పాటు వారి ఇద్దరు అక్కాచెల్లెళ్లకు వారసత్వంగా సంక్రమించినట్లు స్థానికులు పేర్కొంటున్నారు . అయితే



కుటుంబ భాగపంపిణీ ప్రకారం మొత్తం భూమిని ఐదు వాటాలుగా విభజించి ఒక్కొక్కరికి సుమారు 17.10 ఎకరాల చొప్పున కేటాయించినట్లు తెలుస్తోంది. అనంతరం వారసులు తమ తమ వాటాలను రిజిస్ట్రేషన్ చేసుకుని, భౌతిక స్వాధీనాలు కూడా పొందినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అసలు కథ ఇక్కడే మొదలైంది. అల్వాల బాగయ్య వాటాలోని భూమిలో నుంచి 1970 ప్రాంతంలో బాలగోని లింగయ్య గౌడ్ సుమారు 8 ఎకరాల 25 గుంటల భూమిని కొనుగోలు చేసి, అనంతరం ఆయన తన ఇద్దరు కుమారులు బాలగోని బాలరాజ్ గౌడ్, బాలగోని వెంకటేశ్ గౌడ్‌లకు సమాన వాటాలుగా భూమిని పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. అయితే కాలక్రమేణా ఈ 8. 25 ఎకరాల భూమికి సంబంధించిన వివాదం విస్తరించి, మిగిలిన వాటాదారులకు చెందిన భూములు, వాటిని కొనుగోలు చేసిన రైతులకు శాపంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఎందుకంటే ఈ 8.25 ఎకరాల భూమిని వివిధ బ్యాంకులకు తనఖా పెట్టి సుమారు 100 కోట్లకు పైగా రుణాలు పొందినట్లు తెలుస్తుంది. అనంతరం రుణాలు చెల్లించక పోవడంతో సదరు బ్యాంకులు రికవరీ, వేలం ప్రక్రియలు ప్రారంభించగా, ఇప్పుడు పార్టిషన్ వివాదాల పేరుతో న్యాయస్థానాలను ఆశ్రయించి కాలయాపన చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఒకవైపు భూమిని తనఖా పెట్టి భారీ రుణాలు పొందడం, మరోవైపు పార్టిషన్ జరగలేదని న్యాయస్థానాలను సైతం తప్పుదోవ పట్టించి కాలయాపన చేస్తున్నాడు.

**8 ఎకరాల వివాదం.. 86 ఎకరాల రైతులకు శాపం ?**



**మాజీ రౌడీ షీటర్ బాల్ రాజ్ గౌడ్**

స్థానిక రైతులు, ప్లాట్ల యజమానుల కథనం ప్రకారం.. అసలు వివాదం కేవలం 8 ఎకరాలకు మాత్రమే పరిమితమైనప్పటికీ, ప్రస్తుతం దానిని ఆధారంగా చేసుకుని మిగిలిన భూములపై కూడా హక్కుల వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న రైతులు, చట్టబద్ధంగా ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు బాధితులు పేర్కొంటున్నారు.

**రూ.10 కోట్లకు పైగా ఆదాయపు పన్ను ఎగవేత ?**

ఈ వ్యవహారంలో ఆదాయపు పన్ను శాఖ కోణం కూడా చర్చనీయాంశమైంది. వివిధ బ్యాంకుల నుండి రూ. 100 కోట్లకు పైగా రుణాలు పొంది సుమారు రూ.10 కోట్లకు పైగా ఆదాయపు పన్ను బకాయిలు చెల్లించాలని ఐటీ నోటీసులు జారీ చేసినప్పటికీ, సదరు వ్యక్తులు ఆ పన్నులను ఎగవేస్తూ బాహాటంగానే తిరుగుతున్నారని, అయినా అధికారులు వారిపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పన్ను ఎగవేతదారులను అరెస్ట్ చేయడంలో, వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో సంబంధిత శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని బాధితులు, స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు వెంటనే జోక్యం చేసుకుని, సమగ్ర విచారణ జరపాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**నిర్మాణంలో ఉన్న ప్రహారీ కూల్చివేత.. కేసు నమోదు**

అన్నోజిగూడలోని మినీ సింగపూర్ లేఔట్ లో స్థానిక మున్సిపల్ సర్కిల్ కార్యాలయం నుంచి నిర్మాణ అనుమతులు పొంది ప్లాట్ల యజమానులు అభివృద్ధి పనులు చేపడుతున్న సమయంలో, బాలాగోని బాలరాజు గౌడ్ అనే మాజీ రౌడీ షీటర్ ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ప్రహారీ గోడను కూల్చివేసి ప్లాట్లను ఆక్రమించుకునే ప్రయత్నం జరిగిందని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. అయితే కేసు నమోదైనప్పటికీ పరిస్థితుల్లో పెద్దగా మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల ఆరోపణల ప్రకారం, లేఔట్ లో నిర్మాణాలు పూర్తయి ప్రజలు నివాసాలు ఏర్పాటు చేసుకుంటే భూముల యాజమాన్యం, స్వాధీనం, వాస్తవ పరిస్థితులు స్పష్టంగా బయటపడతాయనే ఆందోళనతోనే ఈ విధమైన చర్యలకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు బ్యాంకులు, మరోవైపు న్యాయస్థానాల్లో కొనసాగుతున్న వివాదాల నేపథ్యంలో, చట్టబద్ధంగా ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులపై ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యంగా ప్రహారీ గోడల కూల్చివేత, నిర్మాణాల అడ్డంకులు వంటి చర్యలు జరుగుతున్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు.



**బాధితులతో మాట్లాడుతున్న మహా, స్టేట్ బ్యూరో చీఫ్**

**పోలీస్ కమిషనర్, హైడ్రా జోక్యం చేసుకోవాలి**

భూ వివాదం పేరుతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో పోలీస్ కమిషనర్ తక్షణం జోక్యం చేసుకుని బాధిత రైతులు, ప్లాట్ల యజమానులకు ప్రాణ, ఆస్తి రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే భూములపై జరుగుతున్న వివాదాలు, కబ్జా ఆరోపణలు, ప్రహారీ గోడల కూల్చివేత, బౌన్సర్ల హల్‌చల్ వంటి అంశాలపై హైడ్రా కూడా క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

వారసత్వంగా సంక్రమించి, దశాబ్దాలుగా ప్రశాంతంగా స్వాధీనంలో ఉన్న భూములను ఆధారంగా చూపించి భారీ మొత్తంలో రుణాలు పొందిన అనంతరం, ఆ రుణాల రికవరీ ప్రక్రియలను తప్పించుకునేందుకు కేవలం 8 ఎకరాల భూమి వివాదాన్ని కారణంగా చూపుతూ మిగిలిన 80 ఎకరాల రైతులు, ప్లాట్ల యజమానులను ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలను అధికారులు తీవ్రంగా పరిగణించాలని బాధితులు కోరుతున్నారు. మాజీ రౌడీషీటర్ బాలగోని బాలరాజ్ గౌడ్‌పై మళ్లీ రౌడీషీట్ తెరిచి కఠిన నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని పోలీస్ కమిషనర్, హైడ్రా కమిషనర్‌లను స్థానికులు, బాధితులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.



అలువాల దర్శన్ గౌడ్



అలువాల లక్ష్మణ్ గౌడ్



యాంజాల భాస్కర్ గౌడ్



అబ్బాబత్తిని నరసింహ



అశోక్ వర్ధన్ రావు



పీ సతీష్ రెడ్డి

## బాధితుల ఆవేదన

"వివాదానికి కారణమవుతున్న భూమి అసలు బలగాని బాలరాజ్ గౌడ్ సొంతంగా సంపాదించుకున్న ఆస్తి కాదు. ఆయన తండ్రి బలగాని లింగయ్య గౌడ్ 1970లో కొనుగోలు చేసిన భూమి మాత్రమే. అయితే ఇప్పుడు బ్యాంకుల నుంచి పొందిన రుణాల వ్యవహారం, వాటి రికవరీ చర్యలను తప్పించుకునేందుకు 'పార్టిషన్ జరగలేదు', 'కోర్టు వివాదాలు ఉన్నాయి' అనే కారణాలను చూపిస్తూ న్యాయస్థానాలను సైతం తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయి" అని బాధితులు ఆరోపిస్తున్నారు."మా భూములు మాత్రం తరతరాలుగా వారసత్వంగా సంక్రమించినవి. కుటుంబ భాగపంపిణీలు పూర్తయి, చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్లు జరిగి, దశాబ్దాలుగా ప్రశాంతంగా సాగులో ఉన్న భూములు. ఆ భూములను మేము అమ్మితే కొనుగోలు చేసిన రైతులు, ప్లాట్ల యజమానులను ఇప్పుడు అనవసరంగా వివాదాల్లోకి లాగుతున్నారు. తమకు ఎలాంటి సంబంధం లేని వ్యవహారాల్లో అమాయక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు" అని వారు వాపోతున్నారు."ప్రైవేట్ బౌన్సర్లను, అనుచరులను వెంటబెట్టుకుని భూముల వద్దకు వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నారు. మహిళలు, వృద్ధులు, రైతు కూలీలు కూడా పొలాలకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఏర్పడింది. బౌన్సర్ల హల్‌చల్ కారణంగా గ్రామంలో భయాందోళన వాతావరణం నెలకొంది. చట్టబద్ధంగా కొనుగోలు చేసిన మా భూముల్లోకి వెళ్లడానికి కూడా భయపడాల్సిన పరిస్థితి రావడం బాధాకరం" అని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు."కాబట్టి జిల్లా పోలీసు యంత్రాంగం, పోలీస్ కమిషనర్ తక్షణమే స్పందించి మాజీ రౌడీషీటర్ బలగాని బాలరాజ్ గౌడ్‌తో పాటు అతని ప్రైవేట్ సైన్యం, బౌన్సర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. గ్రామంలో శాంతి భద్రతలు కాపాడుతూ రైతులు, ప్లాట్ల యజమానులకు ప్రాణ, ఆస్తి రక్షణ కల్పించాలి" అని అలువాల దర్శన్ గౌడ్, గంటా సోమిరెడ్డి, అబ్బబత్తిని నర్సింహ, యంజాల భాస్కర్ గౌడ్‌తో పాటు ఇతర బాధితులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



గంటా సోమి రెడ్డి

---

### గిరిజనులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్

**రూ.కోటితో అభివృద్ధి పనులు పూర్తి**

**అమరావతి, మహా:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేసి మరోసారి మాట నిలబెట్టుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం బల్లగరువు గ్రామ పర్యటన సందర్భంగా స్థానికులు కోరిన అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. బల్లగరువు, వెలగపాడు, కొరపర్తి గ్రామాల్లో సుమారు రూ.కోటి వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తయ్యాయి.గతంలో బల్లగరువు పర్యటన సందర్భంగా గిరిజనులతో మమేకమైన పవన్ కల్యాణ్ వారి సమస్యలను స్వయంగా తెలుసుకుని తాగునీరు, అంగన్వాడీ భవనాలు, రహదారులు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీలను నిర్దేశిత గడువులోనే అమలు చేయడంతో స్థానిక గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.మహిళలు, చిన్నారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో బల్లగరువు, వెలగపాడు, కొరపర్తి గ్రామాల్లో రూ.55 లక్షల వ్యయంతో మూడు అంగన్వాడీ కేంద్రాలను నిర్మించారు. బల్లగరువు, వెలగపాడులో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో నూతన అంగన్వాడీ భవనాలు నిర్మించగా, కొరపర్తిలో గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ ద్వారా అంగన్వాడీ భవనానికి ప్రహరీ గోడ నిర్మించారు.అదనంగా కొరపర్తి గ్రామంలోని ఎంపీపీ పాఠశాల భవనాన్ని పునరుద్ధరించారు. గ్రామ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు బోరు ఏర్పాటు చేసి, పైప్‌లైన్‌ల ద్వారా తాగునీటి సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేశారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాన్ని కూడా పూర్తి చేసి రవాణా సౌకర్యాలను మెరుగుపరిచారు.గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గిరిజన గ్రామాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే తమ ప్రభుత్వ విధానమని ఆయన తెలిపారు.

---

# నేటి నుండి పార్లమెంట్ సమావేశాలు

( మొదటి పేజీ తరువాయి )

ప్రవేశపెట్టనుంది. మరోవైపు దేశభక్తిని రగిలించే 'వందేమాతరం' గేయానికి జాతీయ గీతంతో సమానమైన హోదాను కల్పిస్తూ రూపొందించిన చారిత్రక బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. ఒకవైపు ప్రభుత్వం బిల్లుల ఆమోదానికి వ్యూహాలు రచిస్తుండగా, మరోవైపు ప్రజా సమస్యలు, వివాదాస్పద అంశాలపై ప్రభుత్వాన్ని ఎండగట్టేందుకు ప్రతిపక్షాలు తమ అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకున్నాయి. సభను సజావుగా నడపడంలో సహకారం కోరేందుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఆదివారం జరిగిన అఖిలపక్ష సమావేశం రణరంగాన్ని తలపించింది. కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో సహా 40 రాజకీయ పార్టీలకు చెందిన 58 మంది ఫ్లోర్ లీడర్లు హాజరైన ఈ భేటీలో విపక్షాలు ప్రభుత్వంపై ముప్పేట దాడికి దిగాయి. అయోధ్య రామమందిరం విరాళాల దుర్వినియోగం, దేశవ్యాప్తంగా కలకలం రేపిన 'నీట్' పేపర్ లీకేజీ, పెట్రోల్‌లో ఈ20 ఇంధన మిశ్రమం తదితర అంశాలపై సభలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని ప్రతిపక్షాలు తేల్చిచెప్పాయి. ముఖ్యంగా మణిపూర్ ఉద్రిక్త పరిస్థితులపై సభలో తప్పనిసరిగా సమగ్ర చర్చ జరగాలని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ పట్టుబట్టగా, లడఖ్‌లో పర్యావరణ పరిరక్షణ కోసం సోనమ్ వాంగ్‌చుక్ చేస్తున్న నిరసనలపై పార్లమెంట్‌లో చర్చించాలని సమాజ్‌వాదీ పార్టీ గట్టిగా డిమాండ్ చేసింది. ఇక మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని, ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల బలంతోనే దీనిని వర్తింపజేయాలని డీఎంకే స్పష్టం చేసింది.

**అఖిలపక్షం వాకౌట్**

ఈ అఖిలపక్ష సమావేశం అత్యంత నాటకీయ పరిణామాల మధ్య వాకౌట్‌ల పర్వానికి దారితీసింది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీకి చెందిన 20 మంది తిరుగుబాటు ఎంపీలకు ఈ భేటీకి కేంద్రం ఆహ్వానం పంపడంపై ఆ పార్టీ ఎంపీ మహువా మొయిత్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుగుబాటు ఎంపీల విలీనానికి స్పీకర్ ఇంకా ఆమోదం తెలపలేదని, టేబుల్ ఆఫీస్ జాబితా ప్రకారం టీఎంసీ అధికారిక బలం 28 మాత్రమేనని ఆమె కుండబద్దలు కొట్టారు. 91వ రాజ్యాంగ సవరణ తర్వాత ప్రత్యేక కూటమికి ఆస్కారమే లేదని తేల్చిచెప్పారు. తుది నిర్ణయం లేకుండా టీఎంసీ సంఖ్యాబలాన్ని అంచనా వేయడం రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ మండిపడ్డారు. రాజ్యాంగ పరిరక్షణ కోరుతూ టీఎంసీకి మద్దతుగా కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, జేఎంఎం, నేషనల్ కాన్ఫరెన్స్, శివసేన (యూబీటీ), ఆప్, వామపక్ష పార్టీల నేతలు సమావేశం నుంచి మూకుమ్మడిగా వాకౌట్ చేయడం తీవ్ర కలకలం రేపింది. అయితే, కాసేపటి తర్వాత ఉద్రిక్తతలు చల్లారడంతో వీరంతా తిరిగి సమావేశానికి హాజరయ్యారు. విపక్షాల ఆందోళనలు, వాకౌట్‌ల నడుమ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సభను సజావుగా నడిపేందుకు ప్రతిపక్షాల సహకారాన్ని కోరారు. పార్లమెంటు ఎంత బాగా పనిచేస్తే దేశానికి అంత ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని ఆయన స్పష్టం చేశారు. ఉభయ సభల్లో విపక్షాల గొంతుకను వినేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని, అదే సమయంలో విపక్షాలు కూడా ప్రభుత్వ వాదనను సంయమనంతో వినాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 8 బిల్లులు మాత్రమే అజెండాలో ఉన్నాయని, కొత్తగా మరేదైనా బిల్లును సభలోకి తీసుకురావాల్సి వస్తే ముందుగా 'బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)'లో సమగ్రంగా చర్చించి, ప్రతిపక్షాలకు ముందస్తు సమాచారం ఇచ్చిన తర్వాతే ముందుకు వెళ్తామని ఆయన భరోసా ఇచ్చారు. సాధారణ పార్లమెంటరీ ప్రక్రియలో భాగమైన జీరో అవర్, ప్రత్యేక ప్రస్తావనలపై ప్రతి సభ్యుడికీ మాట్లాడే పూర్తి హక్కు ఉంటుందని, సానుకూల వాతావరణంలో ప్రభుత్వం తీసుకొచ్చే బిల్లులకు అన్ని పార్టీలు మద్దతు తెలపాలని కిరణ్ రిజిజు కోరారు.

---

# స్థానిక సంస్థల ఎన్నికలపై చంద్రబాబు ఫోకస్

**పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం.**

**అభ్యర్థుల ఖరారు అధిష్టానానిదే**

**అమరావతి, మహా :** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. పార్టీ ముఖ్యనేతలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తాజా రాజకీయ పరిణామాలు, ఎన్నికల వ్యూహం, పార్టీ బలోపేతంపై సమీక్ష నిర్వహించారు. రానున్న స్థానిక ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.వచ్చే నెల తొలి లేదా రెండో వారంలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు, పార్టీ యంత్రాంగంతో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించే అవకాశముందని చంద్రబాబు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల వ్యూహం, క్షేత్రస్థాయి కార్యాచరణ, ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేయనున్నట్లు వెల్లడించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే ప్రధాన లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఏ నియోజకవర్గంలో ఏ పార్టీ ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలన్న అంశంపై ప్రస్తుతం ఎలాంటి చర్చలు అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ విషయంపై కూటమి పార్టీల అగ్ర నాయకత్వం పరస్పర చర్చల అనంతరం తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.స్థానిక సంస్థల్లో సీట్ల పంపకాలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు అనవసర చర్చలకు దూరంగా ఉండాలని చంద్రబాబు ఆదేశించారు. అలాంటి వ్యాఖ్యలు కూటమి ఐక్యతకు భంగం కలిగించే అవకాశముందని హెచ్చరించారు. ఈ అంశాన్ని పూర్తిగా పార్టీ అధిష్టానాలకే వదిలేయాలని సూచించారు.కూటమి పార్టీల మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రత్యర్థి పార్టీలు ప్రయత్నిస్తున్నాయని, ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇందుకు అవకాశాల కోసం ఎదురు చూస్తోందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అలాంటి ప్రయత్నాలకు తావివ్వకుండా అన్ని కూటమి పార్టీలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో శ్రమించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ప్రజల్లో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లి స్థానిక ఎన్నికల్లో శాతం శాతం విజయాన్ని లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

---

# ఆగస్టు 3 వరకు గాంధీభవన్‌కు రావొద్దు

( మొదటి పేజీ తరువాయి )

కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేవలం బీఎల్ఓ రిపోర్టులపైనే ఆధారపడకుండా.. బీఎల్ఏ రిపోర్టులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొంటూనే ఎంపీలు తమకు కేటాయించిన ప్రాంతాల్లో సమీక్షలు కొనసాగించాలని ఆదేశించారు. బాధ్యతలు నిర్వర్తించని ఎంపీలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాబోయే పది రోజులు ఎన్నికల ప్రచారం తరహాలో యుద్ధప్రతిపాదికన పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జులై 30వ తేదీన ఈ పనుల పురోగతిపై పూర్తిస్థాయి సమీక్ష ఉంటుందని, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**ఇద్దరికి సమన్వయ బాధ్యత**

ఈ మొత్తం ప్రక్రియను ఇన్‌చార్జ్ మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో కలిసి సమన్వయం చేయాల్సిన బాధ్యతను మహేష్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలకు సీఎం రేవంత్ రెడ్డి అప్పగించారు. ఎస్ఐఆర్‌పై ఎవరైనా అలసత్వం ప్రదర్శిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయన్న సీఎం.. కష్టపడి పనిచేసే వారికి అదిరిపోయే బంపర్ ఆఫర్ ప్రకటించారు. రాష్ట్రంలో అత్యుత్తమంగా పనిచేసిన టాప్ 100 బీఎల్ఏలకు.. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతో నేరుగా భేటీ అయ్యే అవకాశాన్ని కల్పిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

# అచ్చంపేట, ఆదిలాబాద్ టాప్

**హైదరాబాద్, మహా :** ఎస్ఐఆర్ పనితీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూమ్ సమావేశం నిర్వహించగా, ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ , పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నేతలకు తీవ్ర హెచ్చరికలు జారీచేయడంతో పాటు మంత్రులు జిల్లాల్లో పర్యటించి.. పదిరోజులు యుద్ధంలా పనిచేయాలని నిర్దేశించారు. నియోజకవర్గాల వారీగా స్టేటస్ రిపోర్ట్ లను ఈ సందర్భంగా వివరించి, సీఎం నేతలకు పలు హెచ్చరికలు జారీ చేశారు. అచ్చంపేట, ఆదిలాబాద్ తో పాటు మొత్తం 42 నియోజకవర్గాలు ఏకేటగిరీలో ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో నేతలు, కార్యకర్తలు ఉత్సాహంగా, చురుకుగా పనిచేస్తున్నారు. ఫర్వాలేదనిపించేలా ఉన్న వాటిని బికేటగిరిలో చేర్చగా, ఇందులో ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించిన బోథ్ నియోజకవర్గం ఉంది. సి కేటగిరిలో ఆసిఫాబాద్, ఖానాపూర్ ఉండగా, డికేటగిరీకి నిర్మల్ పడిపోయింది. డికేటగిరీ నియోజకవర్గాలపై ప్రత్యేకంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఊరుకోనని సీఎం హెచ్చరించారు.

**ఆదిలాబాద్ ముందంజ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్ ఐ ఆర్ పర్యవేక్షణలో కాంగ్రెస్ పార్టీ పనితీరుపై తీసుకున్న స్టేటస్ రిపోర్ట్ జూమ్ మీటింగ్ లో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం టాప్ “ఏ" కేటగిరీ లో నిలిచి బాగా పనిచేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ని, క్యాడర్ ను సీఎం ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో రానున్న 10 రోజులు ఇలాగే బాగా పని చేయాలని సూచించారు. ఈ మీటింగ్ లో జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణా రావు , ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ , పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఆదిలాబాద్ ఒక్కటే ఏ కేటగిరిలో నిలవగా, ఉమ్మడి జిల్లాగా చూస్తే మంచిర్యాల, చెన్నూరులో కూడా బాగా పని జరిగి ఏకేటగిరిలో ఉన్నట్లు పార్టీవర్గాల ద్వారా తెలిసింది.

# అభిమానులకు మెగాస్టార్ చిరంజీవి కానుక

**హైదరాబాద్, మహా :** సినీ అభిమానులను ఎప్పుడూ తన కుటుంబ సభ్యులుగా భావించే మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు అరుదైన కానుక అందబోతోంది. ఎన్నో ఏళ్లుగా చిరంజీవిపై అభిమానంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, అఖిల భారత చిరంజీవి యువత ద్వారా సామాజిక సేవలో పాల్గొంటున్న సీనియర్ అభిమానులకు రూ.5 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యాన్ని కల్పించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి కూడా సహకారం అందించనున్నట్లు సమాచారం.అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షుడు రవణం స్వామి నాయుడు ఈ పథకాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ నెల 22న చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే వేడుకల్లో భాగంగా ఈ ఆరోగ్య బీమా పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈసారి చిరంజీవి జన్మదినోత్సవాలను ఈ నెల 15 నుంచి వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా గత 30 సంవత్సరాలుగా చిరంజీవి అభిమాన సంఘాలతో అనుబంధం కొనసాగిస్తూ, రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న సీనియర్ అభిమానులను ప్రత్యేకంగా గుర్తించి వారికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా పాలసీలు అందజేయనున్నట్లు రవణం స్వామి నాయుడు తెలిపారు.ఈ బీమా పథకం అమలును ముందుగా గుంటూరు జిల్లాలో ప్రారంభించి, అనంతరం దశలవారీగా ఇతర జిల్లాల అభిమానులకు కూడా విస్తరించనున్నట్లు ఆయన వెల్లడించారు. అభిమానుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ చేపడుతున్న ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా చిరంజీవి అభిమానుల్లో ఆనందాన్ని నింపుతోంది.అభిమానుల సేవలను గుర్తించి వారి ఆరోగ్య భద్రత కోసం ప్రత్యేక బీమా పథకాన్ని అందించడం సినీ రంగంలో అరుదైన నిర్ణయంగా అభిమానులు అభిప్రాయపడుతున్నారు. చిరంజీవి జన్మదినోత్సవాల సందర్భంగా ప్రకటించిన ఈ కార్యక్రమం అభిమాన సంఘాల సంక్షేమానికి కొత్త దిశగా నిలవనుందని భావిస్తున్నారు.

---

# న్యూయార్క్ లో అడుగుపెడితే నెతన్యాహు అరెస్ట్?

**మహా :** ఐక్యరాజ్యసమితి సదస్సు కోసం న్యూయార్క్ రానున్న ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహును అరెస్ట్ చేసే అంశంపై న్యూయార్క్ నగర మేయర్ జోహ్రాన్ మామ్దానీ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. 'ది న్యూయార్క్ టైమ్స్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మేయర్ మాట్లాడుతూ.. నెతన్యాహును ఒక యుద్ధ నేరస్థుడిగా అభివర్ణించారు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) ఆయనపై మోపిన ఆరోపణల నేపథ్యంలో, ఆయన ది హేగ్‌లోని జైలుకు వెళ్లాల్సిన వ్యక్తి అని స్పష్టం చేశారు. తన ఎన్నికల ప్రచారంలోనే నెతన్యాహును అరెస్ట్ చేస్తానని మామ్దానీ హామీ ఇచ్చారు. అయితే, ఒక విదేశీ దేశాధినేతను అరెస్ట్ చేసే అధికారం నగర మేయర్‌కు ఉందా లేదా అనే అంశంపై తాము ప్రస్తుతం నగర న్యాయ సలహాదారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. "న్యూయార్క్ నగర చట్టాలు నాకు ఏ మేరకు అనుమతి ఇస్తే.. ఆ మేరకు చర్యలు తీసుకోవడానికి నేను వెనుకాడను" అని మామ్దానీ తేల్చి చెప్పారు. గత కొన్నేళ్లుగా నెతన్యాహు తీసుకున్న నిర్ణయాల వల్లే ప్రపంచవ్యాప్తంగా చాలా మంది ఇదే అభిప్రాయంతో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. మేయర్ మామ్దానీ వ్యాఖ్యలపై ఇజ్రాయెల్ శ్రేణులు తీవ్రంగా స్పందించాయి. ఐరాసలో ఇజ్రాయెల్ రాయబారి డానీ డానన్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కౌంటర్ ఇస్తూ.. "న్యూయార్క్ నగరంలో పెరుగుతున్న యూదు వ్యతిరేకతను (యాంటీ సెమిటిజం) అరికట్టడం చేతకాని మేయర్, కేవలం హెడ్‌లైన్స్‌లో నిలవడం కోసమే ఇజ్రాయెల్‌పై దాడి చేస్తున్నారు. మీ బెదిరింపుల వల్ల ఏమీ మారదు. ప్రధాని నెతన్యాహు సగర్వంగా న్యూయార్క్ వస్తారు, ఐరాసలో ఇజ్రాయెల్ తరఫున గళం విప్పుతారు. ఈ కేసులో ఎవరినైనా అరెస్ట్ చేయాల్సి వస్తే, అది మొదట మేయర్ జోహ్రాన్ మామ్దానీనే" అని మండిపడ్డారు. కాగా, ఒక రేడియో షోలో నెతన్యాహు మాట్లాడుతూ.. మేయర్ మామ్దానీ హమాస్ ఉగ్రవాదులకు మద్దతు ఇస్తున్నారని, ఆయన మనసులో అమెరికాపై తీవ్ర ద్వేషం దాగి ఉందని ఆరోపించారు.

వికలాంగుల సంక్షేమమే కాంగ్రెస్

# ప్రభుత్వ లక్ష్యం..

- తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య
- మొయినాబాద్‌లో కాంగ్రెస్ వికలాంగుల విభాగం సభ్యత్వ నమోదు ప్రారంభం

**మొయినాబాద్ మహా:** కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న ఓం శాంతి నిలయంలో కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.నరసింహ చారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, టీపీసీసీ నాయకుడు షాబాద్ దర్శన్ ముఖ్యఅతిథులుగా హాజరై సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ.. వికలాంగుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుంచో ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. వికలాంగుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వికలాంగుల సమస్యలు పట్టించుకోలేదని, వికలాంగుల కార్పొరేషన్ పనితీరు కూడా కనిపించలేదని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వికలాంగులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం నమోదు చేసుకొని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగారెడి జిల్లా వికలాంగుల విభాగం అధ్యక్షుడు ఎం.సురేష్, ఈ. జ్ఞానేశ్వర్ గౌడ్, పరమేష్, శేఖర్ రెడ్డి, కె.విజయ్ కుమార్, ఈ.సునీత, జంగయ్య, కె.చారి, బి. శేఖర్, రంగారెడ్డి జిల్లాలోని దివ్యాంగులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు, పాల్గొన్నారు.

# ఆర్టీసీ రాయితీ మాయాజాలం



**హైదరాబాద్, మహా :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం, సమాజ హితం కోసం అహర్నిశలు శ్రమించే జర్నలిస్టులకి ఆర్టీసీ షాక్ ఇస్తోంది. జర్నలిస్టులకు ఇచ్చే ప్రయాణ రాయితీల్లో నిశ్శబ్దంగా కోత విధిస్తూ, వారిపై అదనపు భారాలు మోపుతోంది. గతంలో అమలైన 1/3 (మూడో వంతు) రాయితీని కాగితాలకే పరిమితం చేస్తూ, క్షేత్రస్థాయిలో సగం కంటే ఎక్కువ ధరను వసూలు చేస్తుండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టేట్ అక్రిడిటేషన్ నిబంధనల ప్రకారం జర్నలిస్టులకు టికెట్ ధరలో కేవలం 33 నుండి 35 శాతం మాత్రమే వసూలు చేయాలి. కానీ, ప్రస్తుతం ఆర్టీసీ దాదాపు 50 శాతం (1/2 ధర) కంటే ఎక్కువే వసూలు చేస్తోంది. బస్సు పాస్‌ల మీద స్పష్టంగా 1/3 రాయితీ అని ముద్రిస్తున్న అధికారులు, టికెట్ ఇష్యూయింగ్ మిషన్లలో (టిమ్స్) మాత్రం ఆ మేరకు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయకపోవడమే ఈ దోపిడీకి కారణమని తెలుస్తోంది.

**ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ బస్సుల్లో చుక్కలు**

సాధారణ పల్లె వెలుగు బస్సుల కంటే ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ సర్వీసుల్లో జర్నలిస్టులకు రాయితీ భారం భారంగా మారింది. ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో వీటిలో జర్నలిస్టుల నుంచి ఏకంగా 53 శాతం నుండి 55 శాతం వరకు టికెట్ ధర వసూలు చేస్తున్నారు. అంటే రాయితీ 50 శాతం కూడా ఉండటం లేదు. ఎలక్ట్రిక్ బస్సుల్లో పర్యావరణ హితం పేరిట వచ్చిన ఈ బస్సుల్లో జర్నలిస్టులకు అసలైన షాక్ తగులుతోంది. ఇక్కడ ఏకంగా 60 శాతం ధర వసూలు చేస్తూ, కేవలం 40 శాతం రాయితీతోనే సరిపెడుతున్నారు.

**కండక్టర్లతో వాగ్వివాదాలు.. మిషన్లదే తప్పు**

బస్సుల్లో రాయితీపై కండక్టర్లను ప్రశ్నిస్తే.. మేమేం చేయలేం.. మిషన్లలో (టిమ్స్) ఫీడింగ్ ఎలా ఉంటే అలాగే టికెట్ వస్తుందని వారు చేతులెత్తేస్తున్నారు. రాయితీ లెక్కల్లో స్పష్టత లేకపోవడంతో నిరంతరం జర్నలిస్టులకు, కండక్టర్లకు మధ్య వాగ్వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. దూరాన్ని బట్టి లెక్కించాల్సిన రాయితీలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వార్తల సేకరణ కోసం జిల్లా కేంద్రాలకు, ఇతర పట్టణాలకు నిరంతరం ప్రయాణించే విలేకరులకు ఈ టికెట్ భారం గుదిబండగా మారింది. అతి తక్కువ జీతాలతో పని చేసే జర్నలిస్టులు, తమ సంపాదనలో ఎక్కువ భాగం ప్రయాణాలకే వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**జర్నలిస్టు సంఘాల డిమాండ్**

ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే స్పందించి అన్ని రకాల బస్సుల్లో (ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ సహా) పాత పద్ధతిలో మూడోవంతు రాయితీని పక్కాగా అమలు చేయాలని జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. యూజర్ చార్జీల నుంచి జర్నలిస్టులకు మినహాయింపు ఇవ్వాలని, టికెట్ మిషన్లలో సాఫ్ట్‌వేర్ లోపాలను సరిదిద్దాలని కోరుతున్నాయి. ప్రభుత్వ పెద్దలు స్పందించి ఈ రాయితీ కోతకు అడ్డుకట్ట వేయాలని జర్నలిస్టులు కోరుతున్నారు.

# వర్షా భావంపై సీఎం అలర్ట్

**10 ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక ఐఏఎస్ ల నియామకం.**

**హైదరాబాద్, మహా:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. వర్షపాతం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాల పరిస్థితి, వ్యవసాయ పంటలు, విద్యుత్ సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కోసం పాత 10 ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక అధికారులుగా సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ ప్రత్యేక అధికారులు జులై 20 నుంచి ఆయా జిల్లాల్లో పర్యటించి పరిస్థితులను ప్రత్యక్షంగా సమీక్షించనున్నారు. జిల్లా మంత్రులు, కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి వర్షాభావ పరిస్థితులు, తాగునీటి అందుబాటు, సాగునీటి అవసరాలు, పంటల స్థితిగతులు, భూగర్భ జలాల మట్టాలు, విద్యుత్ సరఫరా వంటి అంశాలపై సమగ్ర నివేదికలను ప్రభుత్వానికి అందించనున్నారు.జిల్లాల నుంచి వచ్చే నివేదికల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టనుంది. ఈ ప్రత్యేక అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించి, వర్షాభావ నివారణ చర్యలు, తాగునీటి సరఫరా, వ్యవసాయ రంగానికి అవసరమైన సహాయ చర్యలపై కీలక ఆదేశాలు జారీ చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారుల్లో హైదరాబాద్ జిల్లాకు జయేష్ రంజన్, రంగారెడ్డి జిల్లాకు వికాస్ రాజ్, కరీంనగర్ జిల్లాకు బెన్‌హర్ మహేశ్ దత్ ఎక్కా, మెదక్ జిల్లాకు ఎ. వాణి ప్రసాద్, నిజామాబాద్ జిల్లాకు యోగితా రాణా, నల్గొండ జిల్లాకు హరిచందన దాసరి, ఆదిలాబాద్ జిల్లాకు ఇలంబరితి కె, వరంగల్ జిల్లాకు ఎ. శ్రీదేవసేన, మహబూబ్‌నగర్ జిల్లాకు వి.పి. గౌతమ్, ఖమ్మం జిల్లాకు అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక అధికారులుగా నియమితులయ్యారు.వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడం, నీటి వనరులను సమర్థంగా వినియోగించడం, వ్యవసాయ రంగానికి అవసరమైన సహకారం అందించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను అమల్లోకి తీసుకొచ్చింది. జిల్లాల వారీగా పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన నిర్ణయాలు వేగంగా తీసుకునేందుకు ఈ చర్యలు దోహదపడనున్నాయి.

# హైకోర్టులో స్టేటస్కో ఉన్నా... బహదూర్ గూడ భూములను ప్రభుత్వం కబ్జా చేసింది...

- అధికారులను కోర్టుల చుట్టూ ప్రదక్షణలు చేయిస్తాం...
- మళ్లీ పెద్దాయని ముఖ్యమంత్రి అవుతారు.
- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి...



**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ బహదూర్ గూడలో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోతున్న రైతులను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, బిఆర్ఎస్ నేత పటోళ్ల కార్తీక్ రెడ్డితో కలిసి ఆదివారం పరామర్శించారు. ప్రభుత్వం ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వకుండా, పరిహారం తేల్చకుండా భూములు లాక్కోవడంపై మహిళా రైతులు సబితా ఇంద్రారెడ్డి ఎదుట కన్నీరు కర్చారు.

తము ఉన్న ఒక్క జీవనాధారం కోల్పోయామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పూల తోటలు, పంటలు వేసాం, దిగుబడి రాకముందే మా పొలాలకు వెళ్లకుండా కంచెలు వేశారు తల్లి అంటూ కన్నీరు మున్నీరుగా విలపించారు.బహదూర్ గూడ రైతులు ధైర్యంగా ఉండండి రైతులకు అండగా బిఆర్ఎస్ పార్టీ, ఇంద్రారెడ్డి కుటుంబం ఉంటుందన్నారు. బుల్లెట్ ట్రైన్ కోసం ప్రతిపాదించిన 650 ఎకరాల భూముల చుట్టూ రెవెన్యూ, హైడ్రా అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య కంచె వేశారు. కోర్టులో స్టేటస్కో ఉన్న కూడా అధికారులు పొలాలకు కంచె ఎలా వేస్తారని ప్రశ్నించారు. అధికారులను కోర్టులచుట్టూ ప్రదక్షిణలు చేయిస్తానన్నారు. ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా, కనీస సమాచారం లేకుండా వ్యవసాయమే జీవనాధారంగా మలుచుకొని వ్యవసాయం చేస్తున్నా రైతుల నుంచి భూమిని లాక్కున్నారు.

ఆ పాపం ఊరుకానే పోదు, రెండు సంవత్సరాలు ఓపిక పట్టండి మళ్లీ పెద్దాయన ముఖ్యమంత్రి అవుతారు. సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదగా పట్టా పాస్ బుక్కులు అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కోలాన్ ప్రదీప్ రెడ్డి, మోహన్ రావు, బుచ్చిరెడ్డి, మంచర్ల శ్రీనివాస్, హనుమంతు ముదిరాజ్, చక్రధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్

**రూ.కోటితో అభివృద్ధి పనులు పూర్తి**

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేసి మరోసారి మాట నిలబెట్టుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం బల్లగరువు గ్రామ పర్యటన సందర్భంగా స్థానికులు కోరిన అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. బల్లగరువు, వెలగపాడు, కొరపర్తి గ్రామాల్లో సుమారు రూ.కోటి వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తయ్యాయి. గతంలో బల్లగరువు పర్యటన సందర్భంగా గిరిజనులతో మమేకమైన పవన్ కల్యాణ్ వారి సమస్యలను స్వయంగా తెలుసుకుని తాగునీరు, అంగన్వాడీ భవనాలు, రహదారులు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీలను నిర్దేశిత గడువులోనే అమలు చేయడంతో స్థానిక గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిళలు, చిన్నారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో బల్లగరువు, వెలగపాడు, కొరపర్తి గ్రామాల్లో రూ.55 లక్షల వ్యయంతో మూడు అంగన్వాడీ కేంద్రాలను నిర్మించారు. బల్లగరువు, వెలగపాడులో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో నూతన అంగన్వాడీ భవనాలు నిర్మించగా, కొరపర్తిలో గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ ద్వారా అంగన్వాడీ భవనానికి ప్రహరీ గోడ నిర్మించారు.

అదనంగా కొరపర్తి గ్రామంలోని ఎంపీపీ పాఠశాల భవనాన్ని పునరుద్ధరించారు. గ్రామ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు బోరు ఏర్పాటు చేసి, పైప్‌లైన్‌ల ద్వారా తాగునీటి సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేశారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాన్ని కూడా పూర్తి చేసి రవాణా సౌకర్యాలను మెరుగుపరిచారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గిరిజన గ్రామాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే తమ ప్రభుత్వ విధానమని ఆయన తెలిపారు.



# బహదూర్ గూడ రైతులకు బిజెపి ఎంపీల పరామర్శ..



రాజేంద్రనగర్ మహా ; బీజేపీ ఎంపీలు ఈటెల రాజేందర్, కొండ విశ్వేశ్వర్ రెడ్డి జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్, కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాసరెడ్డి, బిజెపి నాయకులతో కలిసి వెళ్ళి బహదూర్ గూడ రైతులను ఆదివారం పరామర్శించారు. బుల్లెట్ ట్రైన్ కోసం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతుల భూములకు నష్టపరిహారం చెల్లించకుండా కనీస సమాచారం లేకుండా అధికారులు కంచే వేయడం బాధాకరమన్నారు. పూల తోటలు, కూరగాయలు పండించుకుంటున్నా రైతుల భూములను బలవంతంగా లాక్కుంటుందని బిజెపి ఎంపీలు ఆరోపించారు. బహదూర్ గుడ బాధిత రైతులకు బిజెపి పార్టీ అండగా ఉంటుందన్నారు. ప్రతిసారి ఎన్నికలలో రైతులకు పట్టాలు అందిస్తానని నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రతిసారి అభివృద్ధి కోసం పట్టా పాస్ బుక్ ల కోసం అధికార పార్టీలో చేరారు. 15 సంవత్సరాలుగా బహదూర్ గూడ రైతులకు పట్టాలిప్పించలేకపోయారు, ఇంకెన్నాళ్లు రైతులను మాయ మాటలు చెప్పి మోసం చేస్తారన్నారు. కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బహదూర్‌గూడ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుంది



**రాజేంద్రనగర్, మహా:** బహదూర్‌గూడలో శనివారం చోటుచేసుకున్న ఘటనలకు ప్రతిపక్ష పార్టీలే బాధ్యత వహించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆరోపించారు. రైతులను రెచ్చగొట్టి, భూమికి బదులుగా భూమి ఇప్పిస్తామని తప్పుడు హామీలు ఇవ్వడం వల్లే అధికారులపై దాడులు జరిగాయని అన్నారు.శంషాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బహదూర్‌గూడ రైతుల సమస్యపై గత ఆరు నెలలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రైతులను కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి చర్చలు జరిపించామని, రైతులు కూడా తమ పంటలు, బోర్లు తదితర నష్టాలకు పరిహారం ఇవ్వాలని కోరినట్లు వెల్లడించారు.20 సంవత్సరాలు మంత్రిగా పనిచేసిన సబితా ఇంద్రారెడ్డి రైతులకు ఎందుకు పట్టాలు ఇప్పించలేకపోయారని ప్రశ్నించారు. 70 ఏళ్లుగా వ్యవసాయం చేస్తూ జీవిస్తున్న రైతులకు పట్టాలు ఇప్పించేందుకు తాను గత ప్రభుత్వ హయాంలోనూ ప్రయత్నించానని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అధికార పార్టీలో చేరింది కూడా రైతులకు పట్టా పాస్‌బుక్కు అందించాలనే సంకల్పంతోనేనని పేర్కొన్నారు.ప్రజాపాలన ప్రభుత్వంలో బహదూర్‌గూడ రైతులకు పట్టాలు అందించే ప్రక్రియ ప్రారంభించామని, అయితే పట్టాలు అందించే దశలోనే ప్రతిపక్షాలు రైతులను రెచ్చగొట్టి అధికారులపై దాడులకు పాల్పడేలా చేశాయని ఆరోపించారు. సామరస్యంగా చర్చించి ఉంటే సమస్య పరిష్కారమయ్యేదని, ఇప్పటికైనా రైతులు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు లేనిపోని ఆశలు చూపించి ధర్నాలకు దిగేలా చేసిన ప్రతిపక్షాలను ప్రజలు ఎప్పటికీ క్షమించరని అన్నారు. ప్రభుత్వంతో చర్చల ద్వారా ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి అన్యాయం చేయదని స్పష్టం చేశారు.సర్వే నంబర్లు 1 నుంచి 76 వరకు 195455 పహాణీ, కస్రా భూ రికార్డుల్లో పేర్లు ఉన్న రైతులకు పట్టా పాస్‌బుక్కులు అందజేస్తామని తెలిపారు. సర్వే నంబర్లు 77 నుంచి 101 వరకు ఉన్న భూములు 195455 రికార్డుల ప్రకారం ప్రభుత్వ, సీలింగ్ భూములుగా నమోదై ఉన్నాయని చెప్పారు. ఇందులో 65 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని, మిగిలిన భూముల్లో అర్హులైన రైతులకు పట్టాలు ఇస్తామని వెల్లడించారు. శనివారం జరిగిన ఘటనల నేపథ్యంలో పలువురు రైతులపై కేసులు నమోదైనట్లు తెలిపారు.గతంలో ప్రతిపాదించిన దానికంటే మెరుగైన ప్యాకేజీని ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. భూమి కోల్పోయిన రైతులకు ఎకరాకు 600 గజాల హెచ్‌ఎండీఏ లేఅవుట్ స్థలం, భూములు కొనుగోలు చేసిన వారికి 500 గజాల హెచ్‌ఎండీఏ లేఅవుట్ స్థలం ** కేటాయిస్తామని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ప్రకటించారు.

# పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమమే ధ్యేయం

**అల్పాహారాన్ని అందించిన లయన్స్ క్లబ్ ఆఫ్ కుషాయిగూడ**

**కుషాయిగూడ, మహా:** లయన్స్ క్లబ్ ఆఫ్ కుషాయిగూడ ఆధ్వర్యంలో హంగర్ రిలీఫ్ (ఆకలి నివారణ) కార్యక్రమం నిర్వహించి, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమం లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320హెచ్ జిల్లా గవర్నర్ లయన్ అశోక్ కుమార్ స్వైన్ పీఎంజేఎఫ్ గ నివాసమైన ప్రశాంత్ నగర్, హైటెన్షన్ మెయిన్ రోడ్ వద్ద జరిగింది.ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ లయన్ అశోక్ కుమార్ స్వైన్ పి ఎం జె ఎఫ్ మాట్లాడుతూ, "లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కుషాయిగూడ ఇలాంటి గొప్ప సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉంది. మనం ప్రతి ఉదయం నిద్రలేచే సమయానికి ఈ పారిశుద్ధ్య కార్మికులు తమ విధులను నిబద్ధతతో పూర్తి చేసి, మన పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంచుతున్నారు. వారి సేవలు సమాజానికి ఎంతో అమూల్యమైనవి. ముఖ్యంగా కరోనా మహమ్మారి సమయంలో వారు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అందించిన సేవలు చిరస్మరణీయమైనవి. వారి సేవలను మనమంతా ఎల్లప్పుడూ గుర్తుంచుకొని గౌరవించాలి" అని అన్నారు. ఈ సందర్భంగా లయన్ కొత్త రామారావు మాట్లాడుతూ ప్రతిరోజూ నగర పరిశుభ్రత కోసం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సమాజం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని, వారి సేవలు అత్యంత ప్రశంసనీయమని కొనియాడారు. లయన్ కొత్తపల్లి రాంబాబు పీఎంజేఎఫ్ జిల్లా కార్యదర్శి - గ్లోబల్ కాజెస్ మాట్లాడుతూ, ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించిన క్లబ్ అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారిని అభినందించారు. భవిష్యత్తులో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల కోసం ప్రత్యేకంగా ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహించి వారి ఆరోగ్య సంరక్షణకు లయన్స్ క్లబ్ కట్టుబడి ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు లయన్ తారకేశ్ రావు, కార్యదర్శి లయన్ రామరాజు, కోశాధికారి లయన్ మోహన్, అలాగే లయన్ సాంబశివరావు, లయన్ పెద్ది శ్రీనివాస్, లయన్ సిద్దిపేట శ్రీనివాస్, లయన్ వెంకట్ రెడ్డి, లయన్ చంద్రబాబు, లయన్ వెంకటేశ్వరరావు, లయన్ శ్రీను, లయన్ శ్రావణ్, లయన్ రమేష్ పాల్గొని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు అల్పాహారం వడ్డించారు.ఈ కార్యక్రమం ద్వారా సమాజ సేవే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కుషాయిగూడ మరోసారి తన సేవా తత్వాన్ని చాటిచెప్పింది.

### నేషనల్ పోలీస్ అకాడమీలో తప్పని లైంగిక దాడి...

## మహిళ ఐపీఎస్ ట్రైన్ ఉద్యోగిపై తోటి ఉద్యోగి లైంగిక దాడి....

**రాజేంద్రనగర్ మహా ;** హైదరాబాద్ జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక దాడి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తోటి ఐపీఎస్ అధికారిపై ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి లైంగిక వేధింపులకు గత కొన్ని రోజులు పాల్పడుతున్నట్టు,అత్తాపూర్ పిఎస్ లో ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చిన చేదు నిజం. వాట్సాప్ లో అసభ్యకర మెసేజ్లు పంపుతూ. బూతులు తిడుతూ మెడపై కత్తి పెట్టి బెదిరింపులకు పాల్పడుతూ గొంతు నలపడానికి ప్రయత్నించినట్టు ట్రైనీ ఐపీఎస్ అత్తాపూర్ పోలీస్ స్టేషన్లోఫిర్యాదు చేశారు.బాధితురాలు ప్రైవేట్ వీడియోను రికార్డ్ చేస్తూబాధితురాలి భర్తకు పంపినఉదయ్ కృష్ణ రెడ్డి పై మహిళా ఐపిఎస్ ఆరోపణల నేపథ్యంలో కేసు నమోదు..

# సంతోష్ నగర్ లో ఘరానా మోసం

- పేదలకు ప్లాట్లు అమ్మి.. ముఖం చాటేసిన ఘనుడు
- పైసా పైసా కూడబెట్టి ప్లాట్లు కొంటె.. పత్తా లేకుండా పోయిన రియల్టర్
- రెండు కోట్ల మేరకు నష్టపోయామని లబోదిబోమంటున్న బాధితులు సంతోష్ నగర్ లో ఘరానా మోసం

**కుషాయిగూడ, మహా :** పైసా పైసా కూడబెట్టి పేదలు ప్లాట్లు కొంటే ఓ రియల్టర్ పత్తాలేకుండా పారిపోయిన ఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంతోష్ నగర్ లో ఆదివారం బాధితులు మీడియాతో మాట్లాడుతూ జవహర్ నగర్ సంతోష్ నగర్ లో నివసించే కనిగంటి వెంకటేష్ (42) అమాయక పేదలను ఆసరాగా చేసుకుని అక్రమంగా ప్లాట్లను అమ్ముతూ సొమ్ము చేసుకున్నాడు. అమ్మిన ప్లాట్లను చూపకుండా మరో చోటుకు మార్చుతూ కాలం వెలదీస్తూ వచ్చాడు. ప్లాట్లు చూపాలంటూ బాధితులు నిలదీయడంతో ఇస్తామంటూ నమ్మబల్కుతూ పేదలను నిండా ఉంచాడు. సుమారు రెండు కోట్ల మేరకు బాధితుల నుంచి వసూలు చేసి చక్కగా రాత్రికి రాత్రే కుటుంబ సభ్యులతో సహా పారిపోయాడని కన్నీటి పర్యంతమయ్యారు. పోలీస్ స్టేషన్ సమీపంలో చెన్నాపూర్ మల్కారం ప్రాంతాలలో అక్రమ లేఅవుట్లు వేస్తూ పేదలకు అమ్ముతూ భారీ మోసానికి పాల్పడ్డాడని తెలిపారు. ఒక్కరి వద్ద ఐదు లక్షల నుండి 10 లక్షల వరకు వసూలు చేసి నోటరీలు చేశాడని పేర్కొన్నారు. వెంకటేష్ శనివారం రాత్రి గుర్తు తెలియని ప్రాంతానికి మకాం మార్చాడు. ప్రభుత్వం పట్టించుకోని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. బాధితులు ప్రశాంత్, రేణుక, మంగమ్మ, భాగ్యలక్ష్మి, ప్రవల్లిక, అండాలు, స్వాతి ,లావణ్య, సత్తమ్మ, రేణుక, పద్మ, నవనీత, సులోచన కవిత తదితరులు పాల్గొన్నారు.



## నిరుద్యోగ యువతను రెచ్చగొట్టొద్దు

**కరీంనగర్, మహా :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన నిరుద్యోగ నిరసనల వ్యాఖ్యలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఘాటుగా స్పందించారు. కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, నిరుద్యోగ యువతను రాజకీయ ప్రయోజనాల కోసం రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రూప్1 పరీక్షలను ఎందుకు సక్రమంగా నిర్వహించలేకపోయారో కేటీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడినందుకు ముందుగా బీఆర్ఎస్ నాయకులే యువతకు క్షమాపణ చెప్పాలని మంత్రి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఉద్యోగ నియామక ప్రక్రియ వేగవంతమైందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి తీరుతామని మరోసారి స్పష్టం చేశారు.

# 'చలో సంసద్' యాత్రకు అనుమతి లేదు.

- ఢిల్లీ పోలీసుల స్పష్టీకరణ.
- నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తే చర్యలు.

ఢిల్లీ, మహా.పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతిపాదిత 'చలో సంసద్' యాత్రకు అనుమతి ఇవ్వలేదని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. ఈ యాత్ర నిర్వహణకు సంబంధించి ఎలాంటి అధికారిక అనుమతి కోరలేదని, అందువల్ల అనుమతి కూడా మంజూరు చేయలేదని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. న్యూఢిల్లీ జిల్లాలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత సెక్షన్ 163 అమల్లో ఉందని, ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా చేరడం, ర్యాలీలు, ఊరేగింపులు, నిరసనలు నిర్వహించడం నిషేధమని తెలిపారు. అయితే, ముందస్తు అనుమతితో జంతర్‌మంతర్‌లో మాత్రమే నిరసనలు చేపట్టవచ్చని పేర్కొన్నారు.

జులై 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో దేశ రాజధానిలో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించే వారిపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 223తో పాటు ఇతర చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు చట్టాన్ని గౌరవించాలని, అనధికారిక ర్యాలీలు లేదా గుమికూడే కార్యక్రమాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.ఇప్పటికే ఢిల్లీ నగరంలోని కీలక ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. పార్లమెంట్ పరిసరాలు, జంతర్‌మంతర్, పార్లమెంట్ స్ట్రీట్, సెంట్రల్ విస్టా, శంకర్ చౌక్, కన్నాట్ ప్లేస్ ప్రాంతాల్లో అదనపు బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు వాహనాల తనిఖీలు, పికెట్లు, అదనపు పోలీసు బలగాలను మోహరించారు.

మహా పత్రిక
ANN తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 20-07-2026



# ఉండటం అంటే ఏమిటి?

నేను లేను.
సంభవిస్తున్నానంతే.
నదులూ సముద్రాలు లేవు.
కెరటాలు వున్నాయంతే.

కళ్లు కృష్ణబిలంలో ఖగోళాలు.
గోళాల్లోపల ఇంకేవో గోళాలు
దిక్కుదోచక తిరుగుతున్నయ్.


చేతికి దొరికిందంతా
నోట్లో పెట్టుకుంటున్న పాప.
ఇమడక వాంతులు, యుద్ధాలు.

కనిపించిందంతా
పూదండ అనుకుని
మెడలో వేసుకునే మనిషి.
కనిపించని దేదేదో
కనిపించిందని ప్రగల్భాలు.

మెడలో పూదండ
పలుపు తాడవుతుంది.
చేసేదేం ఉండదు.
గాడిలో మూతి పెట్టి తానూ
నాలుగు గడ్డి పరకలు కొరకడమే.
ఆపైన నెమరు వేస్తూ
గాడికి దేహాలు ఆన్చి
కొన్ని తత్వాలు పాడుకోవడమే.
భలే సంగీత కచేరీ.
గాడిచుట్టు గొప్ప రణగొణ ధ్వని,
ఎవరి పులుపుతాడు
ఎక్కువ నాణ్యమని వివాదం తేలక
గాడికి అటిటు కొమ్ముల కోలాటం.

వెళ్తావేం?
రా! రా!!
నువ్వు కూడా
మెడలో ఒక పలుపుతాడు వేసుకో.
గాడిలో మూతి పెట్టు.
గడ్డి పరకలు కొరుకు.
అర్థరహిత జగతిలో అర్థాల కోసం
ఈరుమారుగా వివాదపడు.
పంటి కింద ఎట్లా పడిందాన్ని
అట్టాగే నెమరెయ్, మింగెయ్.

ఈ మెలకువ చెదిరి
మళ్లీ నిద్ర వచ్చే వరకు!



కె. హనుమంత రెడ్డి
+16096472868

## ఆహ్వానం

తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ సౌజన్యంతో
పాలపిట్ట, మయూఖ సంయుక్తాధ్వర్యంలో
నెల్లుట్ల రమాదేవి ,
కొండపల్లి నీహారిణి రచించిన
మూడు పుస్తకాల ఆవిష్కరణ సభ
25 జూలై 2026 ఆదివారం
సభావేదిక : రవీంద్రభారతి మినీహాల్ (మొదటి అంతస్తు), హైదరాబాద్ ,
సాయంత్రం 6 గంటలకు
సభాధ్యక్షులు: గుడిపాటి గారు
కవి, రచయిత,పాలపిట్ట ఎడిటర్
ముఖ్యఅతిథి, ఆవిష్కర్త :
డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి గారు
కవి,రచయిత , తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ అధ్యక్షులు

**సన్మానోత్సవం**
డాక్టర్ ముదిగంటి సుజాత రెడ్డి గారికి
డి. కామేశ్వరి గారికి
విశిష్ట అతిథులు
: డాక్టర్ అమృతలత గారు
శీలా సుభద్ర గారు
ఆత్మీయ అతిథులు,
పుస్తకాల పరిచయకర్తలు :
సింగరాజు రమాదేవి
(నెల్లుట్ల రమాదేవి రచించిన "డి. కామేశ్వరి కథలలో స్త్రీల సంవేదనలు" పుస్తకం ),
డాక్టర్ వాణీ దేవులపల్లి
(కొండపల్లి నీహారిణి రచించిన "కథా సుజాతం" ముదిగంటి సుజాత రెడ్డి కథలు సమగ్ర విశ్లేషణ పుస్తకం)
అరుణ ధూళిపాళ
(కొండపల్లి నీహారిణి రచించిన "అభిమానం" వివిధ పీఠికల సమాహారం పుస్తకం)
తొలి పలుకులు,ఆహ్వానం : రాధిక సూరి
మలి పలుకులు వందన సమర్పణ:
పద్మశ్రీ చెన్నోజ్వల
సాహిత్యాభిమానులందరికీ సాదరాహ్వానం

పాలపిట్ట (గుడిపాటి)


# అనువాదం లలిత సుందరం

టి లలితా ప్రసాద్ కథారచయిత, మంచి అనువాదకుడు. గతంలో విజయదన్ దేతా జానపద కథలు, ప్రపంచ జానపద కథలు, టాగోర్ గోల్డెన్ బోట్, వైకుం బషీర్ కథలు, గ్రీన్ వుడ్ టేల్స్, ట్రైబల్ మిథ్స్ ఆఫ్ ఒరిస్సా, నటాలియా షాట్స్ వరల్డ్ చిల్డ్రన్ మ్యూజికల్ థియేటర్ అనువదించారు. ప్రస్తుతం వెలువడిన "అనగనగా ఒక రాత్రి" అనువాద కథల పుస్తకంలో ఒరియా, మరాఠీ, రాజస్థానీ, అస్సామీ, హిందీ, మలయాళీ, ఇండో ఆంగ్లికన్, ఫిలిప్పీన్స్, మయన్మార్, ఇరానీ కథలు కలిపి మొత్తం 28 కథలు ఉన్నాయి.

అనాధ అయిన కమలను పెంచి పెద్ద చేసి మేనమామ, పెళ్లి చేసి అత్తవారింటికి పంపిస్తాడు దారిలో బందిపోట్లు మీద పడి దోచుకోగా పొదలో దాగిన కమలను, దొంగలను తరిమేసిన హబీర్ ఖాన్ రక్షిస్తాడు. ఆమెను తన ఇంటికి తీసుకెళ్లినా , ఆమె బ్రాహ్మణత్వానికి ఎలాంటి భంగం రాకుండా కాపాడుతాడు. ఆమె తన మేనమామ ఇంటికి పోగా, వారు ఆమెను తమ అమ్మాయి అని చెప్పుకోవడానికి తిరస్కరిస్తారు. దాంతో ఆమె తనను రక్షించిన హబీర్ ఖాన్ కొడుకును పెళ్లి చేసుకుని ముస్లిం గా మారి మెహర్ జాన్ పేరు పెట్టుకుంటుంది. మేనమామ రెండవ కూతురికి పెళ్లి వయసు వస్తుంది. ఆమెకు పెళ్లి చేసి పల్లకిలో పంపిస్తుండగా ఈసారి కూడా బందిపోట్లు దాడి చేస్తారు. వాళ్ళ మీద విరుచుకుపడి తరిమేసిన ఒక ధైర్యవంతురాలు వచ్చి 'భయపడకు అమ్మాయి. నా చెల్లెలు ఎప్పుడైనా ఇబ్బందుల్లో ఉంటే, ఆమెను రక్షించడానికి ఈ ముస్లిం పెద్దక్క ఉందని గుర్తించుకోండి' అని చెప్పి వెళ్ళిపోతుంది. ఆమెనే "మెహర్ జాన్". "అసలు విజేత" కథలో ఎన్నో కావ్యాలు, గ్రంథాలు అర్థం చేసుకోవచ్చు. కానీ ఆడపిల్ల మనసేమిటో తెలుసుకోవడం ఎవరి వల్ల కాదు అనే సత్యాన్ని తెలియజేస్తారు. ఈ రెండు కథలు రవీంద్రనాథ్ ఠాగూర్ రాసినవి.

చిన్నప్పుడు తాను నివసించిన భవనాన్ని చూస్తూ తన బాల్య జ్ఞాపకాలను నెమరేసుకోవడం "దశ దాటాక" అనే రస్కిన్ బాండ్ కథలో కనిపిస్తుంది. పరీక్షల్లో ఉత్తీర్ణులు కాలేని పేద విద్యార్థులకు దొంగ సర్టిఫికెట్లు ఇచ్చాడని పోలీసులు మాస్టారును పట్టుకుంటారు. అతన్ని అనుసరించిన పాత విద్యార్థికి, హిందీ మాస్టర్ గా వచ్చిన అతనికే హిందీ రాదు. అతడు తమకు బోధించింది పంజాబీ అని తెలుసుకొని నోరు వెళ్ళబెడతాడు. ఈ హాస్య కథ కూడా రస్కిన్ బాండ్ రాసినదే. కొత్తగా మూడవ తరగతిలోకి వచ్చిన పిల్లాడు బీద కుటుంబానికి చెందిన వాడని గుర్తించి తోటి విద్యార్థులు, టీచర్ కూడా అవహేళన చేస్తారు. చలిలో, మంచులో నడవడానికి ఆ పిల్లాడు బూట్ల కోసం చూపే శ్రద్ధ, బయట చలి నుండి రక్షణ కోసం క్లాస్ రూమ్ లోనే ఉండి పోవాలి అనుకుంటాడు . కానీ స్కూల్ టైం అయిపోగానే తప్పనిసరిగా చలిలో, మంచులో నగ్న పాదాలతో వెళ్లిపోవడం మరింత బాధాకరమని "బూట్లు" లేని అబ్బాయి కథను అప్సాన ఆజాది రాశారు. ఎదురింట్లో ఉన్న ధనవంతుడి ఆస్తిపాస్తులను తలచుకుంటూ, వారింటి ఆహార పదార్థాల సువాసనలను ఆస్వాదిస్తూ, పొరుగింటి పేదవాళ్ళు ఆరోగ్యంగా తయారయ్యారని ఆ ధనవంతుల కుటుంబంలోని వారు మాత్రం బలహీనులు, రోగులుగా తయారయ్యారని నేరారోపణ చేస్తూ, ఆ ధనవంతుడు కోర్టులో కేసు వేస్తాడు. ఆ బీదవాళ్లు ఎంతో తెలివిగా ఆ కేసులో నుండి ఎలా బయటపడతారో "నాన్న కోర్టుకు వెళ్ళినప్పుడు" అనే కార్లోస్ బులసాన్ రాసిన పిలిప్పీన్ కథ చదివి తెలుసుకోవాల్సిందే. బయట గాలి సోకకుండా, గృహ ఖైదులా ఉంటూ రుచికరమైన భోజనం తింటూ కూడా ఆ ధనవంతుల ఇంట్లోని వారు నీరసంగా బలహీనంగా ఎందుకు ఉంటారు? అదే ఎదురింటి పేదవారు తమకు ఉన్న దాంట్లోనే తింటూ, జీవితాన్ని హాయిగా నవ్వుతూ గడిపేస్తూ ఉంటారు, కాబట్టి ఆరోగ్యంగా ఉన్నారని వారు తెలుసుకోలేక పోతారు.

విజయదన్ దెతా రాసిన రాజస్థానీ కథ "పిలుపు" లో బహురూపి అయిన విదూషకుడు ఏ వేషం వేసుకున్నా ఆ పాత్రలో లీనమైపోతాడు. ఆ పాత్ర తప్ప విదూషకుడు కనిపించడు. కృష్ణ భగవానుడి వేషం వేసుకొని, భక్తులు తనకు సమర్పించిన ధనరాశుల వైపు కన్నెత్తి కూడా చూడడు. వేషం తీసేసిన తర్వాత



మీకు నచ్చినది ఇవ్వమని యాచిస్తాడు. ఇతని ప్రతిభ విన్న రాజుగారు ఆస్థానానికి పిలిపిస్తారు. విదూషకుడు రాక్షస వేషం వేయాలని మంత్రి ఆజ్ఞాపిస్తాడు. వద్దని ,ఆ వేషంలో ఘోరాలు జరుగుతాయని అతను ఎంత వారించినా, ఎవరూ వినిపించుకోరు. విదూషకుడు రాక్షస వేషంలో సభలోకి ప్రవేశించగానే భయపడి అందరూ పారిపోతారు. తాగిన మత్తులో అక్కడ పడి ఉన్న రాజు గారి బావమరిదిని ఆ రాక్షసుడు చంపివేస్తాడు. రాణిగారు తన సోదరుడి మరణానికి ఆగ్రహించి, దానికి కారకులైన వారిని ఉరి తీయమని చెబుతుంది. వేషం విడిచి వచ్చిన విదూషకుడు, నేను ఏ పాత్రలో ఉంటే అందులోనే పరకాయ ప్రవేశం చేస్తాను. ఆ పాత్ర స్వభావం ఎలా ఉంటుందో అలాగే ప్రవర్తిస్తాను. మంచి చెడులు నా ఆధీనంలో ఉండవని విధుషకుడు తెలియజేస్తాడు. అందరికీ ఏం చేయాలో తోచని స్థితిలో ఉంటే మంగలి ఒక ఉపాయం చెబుతాడు. భర్త అంత్యక్రియల్లో సతిని ఆచరించే యువతిగా వేయమని కోరుతారు. విదుషకుడు ఆ పాత్రలో లీనమై నటిస్తూ, అగ్నికి ఆహుతై పోతాడు. రకరకాల చప్పుళ్ళు ఆ జపాన్ మహిళని ఆందోళనకు గురిచేస్తాయి. కుట్టుమిషన్ ఆగిపోయి, సీలింగ్ రిపేర్ అయిన తర్వాత చప్పుళ్ళు వినిపించవు. ఈ విషయమై ఫిర్యాదు చేసే జపాన్ మహిళ అందరి దృష్టిలో "మతితప్పిన మనిషి". ఇది గీ ఫ్షేన్ రాసిన అరబ్బీ కథ. ఐదుగురు డబ్బుతో బలిసిన గర్విష్ఠి యువకులు టౌన్ కెళ్ళి కొత్త ట్రాక్టర్ కొని తెస్తుంటారు. దారిలో ఒక సైకిలిస్టు తమ ట్రాక్టర్ ను ఓవర్టేక్ చేసి పోవడం వారు భరించలేక పోతారు. తమ ట్రాక్టర్ ను వాడి సైకిల్ మీద ఎక్కించడంతో సైకి లిస్టు తల పగిలి చచ్చిపోతాడు. వారి "రాక్షసానందాన్ని" ఈ కథ ఎత్తిచూపుతుంది. శాడిజాన్ని వర్ణించడానికి మనకు ఉన్న పదం పైశాచికానందం. రాక్షసానందం కాదు.

9 ఏళ్ల "చిన్నారి జుకోవ్" ను పని నేర్చుకోవడానికి చెప్పులు కుట్టే వాడి దగ్గరకు పంపిస్తారు. ఆ పిల్లాడికి సరియైన తిండి పెట్టక ఎప్పుడూ కొడుతూ బాధిస్తుంటారు. ఎవరూ లేని సమయంలో ఆ పిల్లవాడు తన తాతకు ఉత్తరం రాస్తూ, తన కష్టాలన్నీ చెప్పుకుంటాడు. అడ్రస్ లేని ఆ ఉత్తరం ఎక్కడికి పోతుందో తెలియదు. కానీ తన తాత వచ్చి తీసుకెళ్తాడనే సంతోషంలో ఆ బాలుడు ఎదురుచూస్తూ ఉండిపోతాడు. ఇది చేకోవ్ రాసిన రష్యన్ కథ. రాత్రివేళ బస్సు దిగి అందులో వచ్చిన అమ్మాయిని దెయ్యంగా పొరబడి అవస్థలకు గురైన వైనం డాక్టర్ శృతి మహాపాత్ర రాసిన "అనగనగా ఒక రాత్రి" అనే ఒరియా కథలో కనిపిస్తుంది. భర్త అయినా, ప్రియుడు అయినా తమ కోర్కెలను తీర్చే వస్తువుగానే చూస్తారు తప్ప ఆమె ప్రతిభ, వ్యక్తిత్వాన్ని పట్టించుకోరని గౌరీ దేశ్ పాండే రాసిన మరాఠీ కథ "పునరావృత్తం" లో తెలియజేస్తారు. పక్షులైనా రెక్కల్లొచ్చేంత వరకే పిల్లల్ని సాకుతాయని మరోమారు తెలియజేసిన "తొలి సాహసం" ఫ్లాహెర్టీ రాసిన ఐరిష్ కథ. తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం త్యాగాలు చేసిన తండ్రులు కూడా ఉన్నారని సయ్యద్ అబ్దుల్ మాలిక్ "మూడు చక్రాల బండి" అనే తన అస్సామీ కథలో తెలియజేస్తారు. వీణాపాణి మొహంతి ఒరియాలో రాసిన" లత" కథలో, ఎంతో కష్టపడి ఆ బీదింటి తండ్రి కూతురి పెళ్లి చేస్తే, అత్తగారు అనేక బాధలు పెట్టి ఆమెను తరిమేస్తుంది. పుట్టింటికొచ్చిన ఆమెను హోలీ పండుగ రోజున ఆ వీధిలోని నలుగురు కుర్రాళ్ళు రేప్ చేస్తారు. దాంతో ఆమె ఊరు విడిచి వెళ్ళిపోతుంది. కొంతకాలానికి రెండేళ్ల పిల్లవాడితో వస్తే ,ఆ పిల్లాడి తండ్రి ఎవరు? నీవు వేశ్యవు కదా అని పీడిస్తే ఆమె అసలు విషయం చెబుతుంది. "ఈ లోకంలో నీకు తండ్రిని నేనేనని ధైర్యంగా చెప్పేవారెరి? మీ అమ్మే నిన్ను కాపాడుతుంది. ఏడవకమ్మా" అని ఆ కుర్రాడిని ఊరడిస్తుంది. "పొందేవి కొన్ని... పోగొట్టుకునేవి కొన్ని" అనే మహీం బోరా రాసిన అస్సామీ కథలో తమ భవిష్యత్తు కోసం, సంపాదన కోసం గ్రామాన్ని వదిలిన కొడుకుల కంటే గుడ్డిదైన తన దున్నపోతు త్యాగానికి సిద్ధపడటం ఆ పెద్దాయనను గర్వంగా తలెత్తుకునేలా చేస్తుంది. చాలామంది అమ్మాయిలు ఇష్టపడే తన స్నేహితుడిని ఒక అమ్మాయి ఎందుకు కోపగించుకుంటుందో తెలుసుకోవాలనే కోరిక అతనికి ఎప్పటికీ తీరకుండానే ఉండిపోయిన విషయాన్ని టిన్ లిన్ రాసిన "ప్రశాంత సరస్సు" అనే మయన్మార్ కథలో చూడవచ్చు. "పెద్ద నోట్లు... చిల్లర కాసులు" అని అటా క్యా రాసిన అస్సామీ కథ స్నేహాలు, ప్రేమలు సమాన స్థాయిలో ఉన్న వారి మధ్యనే ఏర్పడతాయని నొక్కి చెబుతుంది. క్రమశిక్షణకు మారుపేరైన" హెడ్ మాస్టర్" మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మారలేక, మథనపడటం మహిం బోరా రాసిన అస్సామీ కథలో కనిపిస్తుంది. పిల్లలకు సంపాదించిన ఆస్తులు పెంచే ధనవంతుడు ఒకడు. పిల్లల కష్టం మీద బ్రతకాల్సి వచ్చిన పేదవాడు ఇంకొకడు. అలా "ఇద్దరు పెద్దవాళ్ళుండే వాళ్ళ" ని మ శాండర్ మయన్మార్ కథలో చూపిస్తుంది. లోకంలో జీవులంతా ప్రశాంతంగా సుఖంగా ఉండాలని ప్రార్థనలు చేసే తల్లిదండ్రులు. అయినా వీళ్లు ఎప్పుడూ కీచులాడుకుంటూ ఎలా బతికేస్తున్నారో అర్థం కాదని చెప్పే పి మియింట్ రాసిన మయన్మార్ కథ "ఒకటే తీరు".

పెళ్లి జరగాల్సిన పెళ్లికూతురు ఇల్లు తగలబడి అన్ని వస్తువులతో పాటు వారి ఆశలు కూడా కాలి బూడిదైపోయిన విషాదాన్ని" శుభోదయం" పేరిట కిన్ వి యు, మయన్మార్ కథగా మలిచారు. భార్యాభర్తలు ఇద్దరు వేరువేరు మార్గాలు ఎంచుకొని అంతిమంగా ఒకే గమ్యాన్ని చేరుకుంటారు. భర్త ఆస్తి, భార్య చదువు అన్నీ నిజంగా విలువ లేనివి .వట్టి భ్రమ అని చివరకు గాని తెలుసుకోలేకపోవడం విజయదన్ దెతా రాసిన రాజస్థానీ కథ "పరిమితి" లో కనిపిస్తుంది. పిల్లలు రిక్షా తొక్కి, ఆడాళ్లు చిన్నచిన్న దుకాణాలు పెట్టుకుని డబ్బు గడిస్తారని తెలిసినా ,మన ఇంటి వాళ్లను కూడా ఆ పనులు చేయమని చెప్పలేం కదా ! డబ్బును గౌరవిస్తే అది మనల్ని రక్షిస్తుందని తెలుసుకుంటే చాలు అనే సత్యాన్ని పి మియింట్ "పాత గొడవలు" అనే మయన్మార్ కథలో చెబుతారు. "అగ్గిపెట్టె "అనే బెంగాలీ కథ రాసిన ఆశాపూర్ణా దేవి, "నేను మహిళలను అగ్గిపెట్టెతో పోలుస్తాను. దేన్నైనా కాల్చి బూడిద చేయగల శక్తి సామర్థ్యాలు ఉన్నప్పటికీ, మంచి మనసు విశాల హృదయం ఉన్నట్టు బయటికి కనిపించే మగాళ్ళ ముసుగులను మాత్రం ఏమీ చేయవు. ఈ సంగతి మగవాళ్ళకి తెలుసు. అందుకని వంటింట్లోనూ స్వేచ్ఛగా ఉండనిస్తుంటారు. పెరట్లో ,పడకగదిలోను, అక్కడా ఇక్కడా ఎక్కడైనా సరే భయం లేకుండా జేబులోను పెట్టుకుంటారు" అని పోల్చిన విధానం బాగా వచ్చింది. ఒక పదిమంది బహిరంగంగా లేదా చాకచక్యంగా ఒక వ్యక్తి తెలివితేటల గురించి ప్రశ్నిస్తే, అతను తనను తాను తీవ్రమైన సందేహాలకు గురికావడం ప్రారంభిస్తాడని ఆర్ కె నారాయణ్ రాసిన ఇంగ్లీష్ కథ "బహుమతి" లో కనిపిస్తుంది. తనను తాను ప్రేమించుకోవడం కంటే ఇతరులను ప్రేమించడం మొదటిసారిగా తెలుసుకున్న అమాయకురాలు ఆమె. పైగా వయసులో ఉంది. అతని అవమాన భారాన్ని ఓ విజేత పతాకంలా మోస్తాను ధైర్యంగా, గర్వంగా అని కమలాదాస్ రాసిన "చదరంగం" మలయాళ కథలో చెప్పుకుంటుంది. భార్యను చందమామలా అపురూపంగా చూసుకున్న భర్త " పెద్దాయన చందమామ" అనే షెన్ పూ రాసిన చైనా కథలో కనిపిస్తాడు.

వస్తురీత్యా, శిల్పరీత్యా విస్తృత వైవిధ్యం కల ఈ దేశ విదేశీ కథలను ఒక దగ్గర చదవడమే మంచి అనుభూతి. ఈ కథలు ఆయా ప్రాంతాల అలవాట్లు, అభిరుచులు, సాంస్కృతిక వైరుధ్యాలను ప్రతిబింబిస్తాయి. మొత్తానికి అనువాదం బాగుంది. కథలు హాయిగా చదివింపజేస్తాయి. ఇందులో రెండు మూడు కథలు తప్ప, మిగతావన్నీ చిన్న కథలే. బహుశా పత్రికల అవసరాల దృష్ట్యా, ఈ చిన్న కథలను ఎంపిక చేసుకొని ఉంటారని భావించాల్సి వస్తుంది.



- కె.పి అశోక్ కుమార్,
97000 00948

# ఏం పాపం చేశానో___?

కథ



ఇది సుబ్బమ్మ అడిగిన ప్రశ్న కాదు___ఆమె బతుకంతా మోసిన నిశ్శబ్ద బాధకి పెట్టుకున్న పేరు.
సుబ్బమ్మ చిన్నప్పటి నుంచే తెలుసుకున్న ఒక నిజం “జీవితం ఎప్పుడూ తేలిక కాదు.”
ఆమె చేతుల్లో బొమ్మలు ఉండాల్సిన వయసులో బాధ్యతలు పెట్టారు. ఆమె కళ్ళలో కలలు ఉండాల్సిన వయసులో కన్నీళ్లు నింపారు.చదువు పూర్తి కాకముందే పెళ్లి___ కొద్దికాలానికే అమ్మగా ప్రమోషన్. ఆమె జీవితం___ఆమె కోసం ఆగకుండా పరుగులు పెట్టింది.చదువు పూర్తి కాకముందే పెళ్లి___ కొద్దికాలానికే అమ్మగా ప్రమోషన్. ఆమె జీవితం___ ఆమె కోసం ఆగకుండా పరుగులు పెట్టింది.భర్త ఉన్నాడు. కానీ ఇంటి బరువును తన భుజాలపై వేసుకునే మనిషి కాదు. ఎవరికీ హాని చేయడు. కానీ ఎవరికీ ఆధారమూ కాలేడు. "ఎలాగో సాగిపోతుంది" అన్న నిర్లక్ష్యమే అతని జీవన విధానం. బాధ్యతల నుంచి తప్పించుకోవడం తప్ప, వాటిని మోయడం అతనికి ఎప్పుడూ రాలేదు.ఇంట్లో ఏ సమస్య వచ్చినా, "చూద్దాం___ అవుతుంది___" అనేవాడు. కానీ ఎలా అవుతుందో మాత్రం చెప్పేవాడు కాదు. చివరికి ఆ "ఎలాగో" అన్న మాటను నిజం చేయాల్సింది మాత్రం సుబ్బమ్మే.భర్త ఉన్నాడు___ కానీ ఆధారం కాదు. సంకల్పం ఉంది___ కానీ నిలబెట్టే బలం లేదు. ఆమె ఒంటరి కాదు___ కానీ కారణం తెలియకుండానే ఒంటరై మాత్రం బతికింది.ఆమెకి ఒకేసారి రెండు ప్రపంచాలు. ఒకటి ఇంటి బరువు. రెండోది భవిష్యత్తు మీద ఆశ.కడుపులో పిల్ల___ చేతిలో పుస్తకం___ నిద్రలేని రాత్రులు___ కన్నీళ్లతో తడిసిన పేజీలు___ కాన్పుల నొప్పుల మధ్య, జీవిత పోరాటాల మధ్య, చదువును కొనసాగించింది. నిద్రలేని రాత్రుల్లో అక్షరాలను కంటబెట్టుకుని చివరికి డిగ్రీ పూర్తి చేసింది. ఆ రోజు ఆమె గెలిచింది. కానీ ఆ గెలుపును ఎవ్వరూ గమనించలేదు___ గుర్తించలేదు. పోరాడగా___ పోరాడగా చివరికి టీచర్ ఉద్యోగం. ఆ రోజు మళ్లీ ఆమె గెలిచింది. ఈ గెలుపుకి కూడా ఎవరూ ఆనందపడలేదు. సుబ్బమ్మ ఉద్యోగం సంపాదించిన రోజు, ఇంట్లో పరిస్థితి మారుతుందనుకుంది. కానీ మారింది ఒక్కటే___ ఇంటి బాధ్యతలన్నీ నిశ్శబ్దంగా ఆమె భుజాల మీదికి వచ్చాయి.భర్త ఉద్యోగం చేసేవాడే. కానీ కుటుంబాన్ని ముందుకు నడిపించే సంకల్పం అతనిలో కనిపించేది కాదు. జీతం వచ్చేది___ అయిపోయేది. ఖర్చులు ఎలా నెట్టుకురావాలో, పిల్లల చదువు ఎలా కొనసాగాలో, అప్పులు ఎలా తీర్చాలో ఆలోచించేది సుబ్బమ్మే.పిల్లలకు తండ్రి అంటే గౌరవం ఉండేది. కానీ ఆప్యాయత మాత్రం పెరగలేదు. వాళ్లు కష్టంలో ఉన్నప్పుడు ముందుగా గుర్తొచ్చేది అమ్మే. సుబ్బమ్మలో ఒక గొప్ప గుణం ఉంది. ఆమె ఆగదు. అవును___ ఆమె ఎన్నడూ ఒకేచోట ఆగలేదు.సుబ్బమ్మ సాధించిన ఉద్యోగం ఆమె జీవితానికి ఊపిరి అయింది. వచ్చే జీతంతోనే ఆ ఇంటి దీపం వెలిగించింది.పిల్లల భవిష్యత్తుకు పునాదివేసింది.ఆమె జీవితం ఒక విచిత్రమైన సమీకరణం. ఎక్కువ కష్టం + తక్కువ గుర్తింపు = ఆమె రోజువారీ వాస్తవం.ఇంట్లో ముగ్గురు పిల్లలు. వాళ్ల చిన్న చిన్న కోరికలు కూడా తండ్రి కంటే తల్లినే వెతికేవి. తండ్రి చెడ్డవాడు కాదు. కానీ పిల్లల మనసుల్లో చోటు సంపాదించుకునే ప్రయత్నం కూడా చేయలేదు. పిల్లలతో ఆడుకునే సమయం లేదు___ మాట్లాడే అలవాటు లేదు___ వాళ్ల భవిష్యత్తు గురించి కలలు కనే తపన కూడా లేదు. ఆ లోటును కూడా సుబ్బమ్మ ఒక్కరే నింపింది.
ఇద్దరు ఆడపిల్లల తర్వాత ఒక్కగానొక్క కొడుకు. ఆ రోజు సుబ్బమ్మకి గుండెల్లోని చీకటిలో ఒక వెలుగు పుట్టినట్లనిపించింది. ఆమె కొడుకు చిన్న చేతివేళ్లు తన జీవితానికి అర్థం ఇచ్చాయనుకుంది.
“ఇదే నా బలం___ ఇదే నా భవిష్యత్తు___” కొడుకుని ఒడిలో పెట్టుకుని మనసులో అనుకుంది. ఆ రోజు నుంచి సుబ్బమ్మ తన కోసం బతకడం మానేసింది. ఆమె తిన్నది అతనికోసం. ఆమె దాచింది అతనికోసం. ఆమె ఏడ్చింది కూడా అతనికోసమే.కుటుంబంలో ఎవరికీ ఏమీ లేకపోయినా కొడుక్కి కొత్త బట్టలు తెచ్చేది. తన ఆకలి మర్చిపోయినా___ కొడుకు ఆకలి మాత్రం ఎన్నడూ మర్చిపోలేదు. కొడుకు చిరునవ్వు నవ్విన రోజు ఆమెకి పండుగ. వాడు ఏడిస్తే___ ఆమె గుండె విరిగేది.స్కూల్‌కి వెళ్లిన మొదటి రోజు___ చిన్నగా “అమ్మా___” అని పిలిచాడు. ఆ పిలుపు ఆమె చెవుల్లో కాదు___ ఆమె గుండెల్లో నిలిచిపోయింది. ఆ రోజు నుంచి ఆమె జీవితమంతా ఒకే మాట చుట్టూ తిరిగింది “నా కొడుకు బాగుండాలి.”
కాలం గడిచింది___సుబ్బమ్మ కొడుకు ఎదిగాడు. ఆమె కష్టం కూడా పెరిగింది. అతను చదివాడు. ఆమె అప్పులు తీర్చింది. కొడుకు పడిపోయాడు___ ఆమె పట్టుకుంది. అతను ఓడిపోయాడు___ ఆమె నమ్మింది. “నువ్వు ఓడిపోలేదు రా___” అని తల నిమిరిన ప్రతిసారి సుబ్బమ్మ తన కొడుకులో కొత్త బలం నింపింది.ఇంటి బాధ్యతలు ఒకవైపు___ అప్పుల బారం మరోవైపు. ఇదంతా సాగుతుండగానే సుబ్బమ్మ పెద్ద కూతురి పెళ్లి చేసింది.
“నా పిల్లలు ఎప్పుడూ తలవంచకూడదు___” ఈ మాటే ఆమె ఆత్మవిశ్వాసం.సుబ్బమ్మ ఎప్పుడూ___ ఎక్కడా తగ్గలేదు. అందినకాడికి అప్పు చేసైనా పిల్లలకు బాధ లేకుండా చేయాలనేది ఆమె తత్వం. బహుశా___ తను పడ్డ నరకం తన బిడ్డలకు కలుగుతుందేమోనన్న భయమే ఆమెను నడిపించింది.ఆ భయం నుంచి పుట్టిన గర్వమే___ఆమెను అప్పులలో ముంచింది.
ఆ తుఫానుల నుంచి ఇంకా కోలుకోకముందే భర్త కాలం చేశాడు.ఆ రోజు సుబ్బమ్మ కన్నీళ్లు పెద్దగా బయటపడలేదు. అతని మీద కోపం లేదు___ గొప్ప జ్ఞాపకాలు కూడా లేవు. కలిసి గడిపిన సంవత్సరాలు ఉన్నాయి___ కానీ కలిసి మోసిన బాధ్యతలు మాత్రం లేవు.నిజానికి అతను పోయిన రోజు కూడా, ఆమెకు ఏడిచే సమయం దొరకలేదు."ఇంకా పిల్లలు ఉన్నారు___ ఇంకా బాధ్యత ఉంది___" అదే ఆమె ఆలోచన. ఆమె కన్నీళ్లు లోపలే గడ్డకట్టిపోయాయి.
అంతటి తుఫానుల మధ్య కూడా కిందామీదాపడి చిన్న కూతురి పెళ్లి చేసి తన బాధ్యత తీర్చుకుంది.వచ్చిన జీతంతో అప్పులు తీర్చడం___పిల్లలను చదివించడం___ ఇదే అక్కడినుంచి ఆమె పదేళ్ల జీవితంలో ఒక చక్రంలా తిరిగిన దినచర్య. ఇంతకుమించి సుబ్బమ్మ ఎన్నడూ ఆగలేదు. ఆలోచించలేదు. అలసిపోలేదు. చివరికి ఉద్యోగంలో రిటైర్మెంట్ వచ్చింది. “ఇక ప్రశాంతంగా ఉంటుంది___” అని ఒక చిన్న కల చూసింది సుబ్బమ్మ.
“ఇప్పుడు నా కొడుకు నా దగ్గర కూర్చుంటాడు___” ఆ ఆశ ఆమె గుండెల్లో చివరి ఆధారం.కొడుకు మెడిసిన్ చదువుతుండగానే పెళ్లి. ఆ రోజు___ సుబ్బమ్మ గుండె నిండిపోయింది. “ఇక నా పని అయిపోయింది___” అని తల ఊపింది.
అది ముగింపు కాదని___ ఇంకా మోయలేనంత బాధ తనను వెంటాడబోతోందని ఆమెకు రోజులు గడిచేకొద్దీ కాని తెలియలేదు. కాలచక్రం మళ్లీ కథను మొదటికొచ్చేలా తిప్పిందనే విషయం___ ఆమెలో అంతులేని ఆవేదనను రగిలించింది.
“అమ్మా___” ఆ పిలుపు వినిపించిన ప్రతిసారి ఒకప్పుడు సుబ్బమ్మ గుండెలో దీపాలు వెలిగేవి. ఇప్పుడు___ అదే పిలుపు వినిపిస్తే గుండె లోపల ఏదో కరిగిపోతుంది.
ఆమె ఎదుట నిలబడి పిలిచే కొడుకు గొంతు తెలిసినదే. కానీ___ ఆ పిలుపులోని అనుబంధం మాత్రం అపరిచితంగా మారిపోయింది. మొదట మాటల్లో మార్పు. తర్వాత చూపుల్లో దూరం. “అమ్మా___ ఇప్పుడు టైమ్ లేదు. తర్వాత మాట్లాడుకుందాం___” కొడుకు అన్న చిన్న మాటలకి సుబ్బమ్మ గుండెల్లో పెద్ద గాయాలయ్యాయి.“కోడలు వచ్చిన తర్వాత కొడుకు మారిపోయాడా?” ఏమో?! సుబ్బమ్మకి ఎన్నటికీ అర్థం కాని ప్రశ్న అది. ముందు అమ్మ చేతి వేడి కోసం వెతికిన వాడు___ ఇప్పుడు ఆమె మాటల నుంచి దూరంగా నడుస్తున్నాడని సుబ్బమ్మ గమనించింది.సరిగ్గా అప్పుడే ఆమె మౌనం ఎంచుకుంది. ఆమెకే అర్థం కానంత మౌనం. ఆ నిశ్శబ్దం సుబ్బమ్మను క్రమంగా దహించుకుంటూ పోయింది.
ఆమెకి కొడుకు మీద ప్రేమ ఉంది. అహంకారం కాదు. ఒక రోజు___“అమ్మా___ నువ్వు కాస్త సైలెంట్‌గా ఉండాలి___” కొడుకు అన్నాడు. ఆ మాట ఆమె గుండెలో చివరిసారి మోగిన గంట. ఆమె మాటలు ఆగిపోయాయి. ఆమె నవ్వు కూడా.
మరో రోజు___ “నీ పెన్షన్ డబ్బులు మాకు అవసరం___” కొడుకు చెప్పాడు. సుబ్బమ్మ ఏమాత్రం బాధపడలేదు.చిరునవ్వు నవ్వింది. “ఇది అంతా నీకోసమే కదరా___” అని మనసులో అనుకుంది. కాలం గడిచింది. ఇంట్లో అందరూ ఉన్నారు. కానీ___ సుబ్బమ్మ మాత్రం ఒంటరిగా... ఆమె ఉంది, కానీ ఎవరికీ కనిపించదు. ఆమె మాటలు ఎవరూ వినరు. ఆమె నొప్పి ఎవరికీ పట్టదు.ఒక రాత్రి___అందరూ నిద్రలో ఉన్నారు. సుబ్బమ్మ మాత్రమే మేల్కొని ఉంది. ఆమె గదిలో వెలుతురు కొంచెం తక్కువే. అక్కడ గోడపై వేలాడుతున్న పాత ఫోటోలలో మాత్రం వెలుగు ఇంకా అలాగే ఉంది.ఒక ఫోటో ముందు ఆమె చూపు ఆగిపోయింది. ఒడిలో కూర్చుని నవ్వుతున్న చిన్న పిల్లవాడు. ఆ నవ్వులో ఎలాంటి ఆశలు లేవు. ఎలాంటి లెక్కలు లేవు. ఆమె వేళ్లు ఆ ఫోటోను తాకాయి.“వీడు నా శ్రావణుడు___” కంటినిండా నీళ్లతో మెల్లగా గుసగుసలాడింది సుబ్బమ్మ. ఆ మాట ఆమె గుండెలోతుల్లోకి మాత్రమే వినిపించింది. “ఇదేనా___?” ఆమె పెదవులు కదిలాయి. “వీడేనా___నా ప్రపంచం అన్నవాడు___?” ఆ ప్రశ్నకు ఆ గదిలో ఎలాంటి జవాబు లేదు.“పెంచడం తప్పా___? నమ్మడం తప్పా___? ప్రేమించడం తప్పా___?” తనలో తిరిగే ప్రశ్నలకు సుబ్బమ్మ దగ్గరే జవాబు లేదు.
మరుసటి ఉదయం___ సుబ్బమ్మ చాలా ప్రశాంతంగా నిద్ర లేచింది. ఎవరితోనూ మాట్లాడలేదు. తన గదిలో ఒక మూలన కూర్చుంది. ఆమె కళ్ళలో కన్నీళ్లు లేవు. క్రితం రాత్రి ఆమె ఏడుపు కూడా అలసిపోయింది.సరిగ్గా అప్పుడే వచ్చాడు “అమ్మా___” ఆ పిలుపు ఎప్పటిలా లేదు, ఆమె కొడుకు. సుబ్బమ్మ నిశ్చలంగా కొడుకుని చూసింది. బహుశా ఆమె వింటున్నది మాట కాదు. ఆ మాట వెనుక దాగి ఉన్న దూరం. ఇద్దరి మధ్యున్న నిశ్శబ్దంలో___ఆమె గుండె చప్పుడు ఆమెకే వినిపిస్తోంది.కొడుకు మాట్లాడటం మొదలుపెట్టాడు. ఎందుకో___ ఒక్కసారిగా బిగ్గరగా ఏడ్చేశాడు. “అమ్మా___” సుబ్బమ్మకు ఆ పిలుపు తన ఎదురునుంచి కాకుండా చాలా దూరం నుంచి వచ్చినట్టే అనిపించింది.
కొడుకు ఏడుస్తుంటే___ గోడమీద ఉన్న ఫోటోలో చిన్నపిల్లవాడే గుర్తొచ్చాడు సుబ్బమ్మకి. తట్టుకోలేకపోయింది “ఏరా___ ఏమైంది?” కంగారుగా అడిగింది తల్లి మనసు.“నీకు ఒక విషయం చెప్పాలి___” ఏడుస్తూనే అన్నాడు కొడుకు.సుబ్బమ్మకు అతను ఏం మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు. తను గుండెల్లో పెట్టుకుని పెంచుకున్న కొడుకు కదా! కొడుకు కన్నీళ్లు చూసి ఆందోళనగా ముందుకు వంగి “ఏమైంది రా? ఏమైనా కష్టమా?” అడిగింది.పశ్చాత్తాపం___ప్రేమ___ వినయం___అన్నీ కలిసిన స్వరంతో “నా భార్య నీకు ఒక విషయం చెప్పమంది___” సుబ్బమ్మకి మాత్రమే వినిపించేంత నెమ్మదిగాఉంది కొడుకు గొంతు.
“ఏంటది?” అనుభవం నిండిన స్థితప్రజ్ఞతతో ఆసక్తిగా అడిగింది. కళ్ళ నీళ్లు మోచేత్తో తుడుచుకుంటూ కొడుకు చెప్పాడు కొడుకు___ “అదే___మన ఇంటి వీలునామా గురించి___” అని ఆగిపోయాడు.తన మాట పూర్తిచేయాలనుకున్నాడేమో వెంటనే “నాకొక్కడికే రాస్తావుగా?” వచ్చినపని పూర్తిచేసాడు. సుబ్బమ్మకు కొడుకు మాట ముందు అర్థం కాలేదు. తన ప్రాణంగా భావించిన కొడుకు___తన రక్తం పంచుకుని పుట్టిన కొడుకు, తన కన్నీళ్లతో కాపాడుకున్న కొడుకు ఇప్పుడు అమ్మను కాదు___అమ్మ పేరున్న ఇంటిని అడుగుతున్నాడా? నిశ్శబ్దంగా కొడుకునే చూస్తోంది. తన ఒడిలో పెరిగిన వాడు. తన ఆకలితో పెరిగిన వాడు. తన కన్నీళ్లతో కాపాడుకున్న వాడు. వాడికి అమ్మ కాదు___ అమ్మ ఇల్లు కావాలి. ఆ క్షణంలో సుబ్బమ్మకు అన్నీ అర్థమయ్యాయి. కొడుకు కన్నీళ్లు అమ్మ కోసం కాదు. అమ్మ పేరున్న ఆస్తి కోసం.కొన్ని క్షణాలు సుబ్బమ్మ మౌనంగా ఉంది. తర్వాత___ చిన్నగా నవ్వింది. ఆ నవ్వు గెలిచిన తల్లి నవ్వు కాదు. అన్నీ కోల్పోయిన మనిషి నవ్వు.“ఇల్లు నీదే రా___” మెల్లగా చెప్పింది సుబ్బమ్మ. కొడుకు ఒక్కసారిగా తలెత్తి అమ్మని చూశాడు. ఒకే ఒక్క క్షణం___ వెంటనే తలదించుకున్నాడు.బహుశా___అమ్మ కళ్ళలో వర్షిస్తున్న కన్నీళ్లు అతని చూపును తట్టుకోనివ్వలేదేమో.“ఇప్పుడే రాస్తాను___” అదే కొడుకుతో సుబ్బమ్మ ఆఖరి మాట.ఆ రోజు సుబ్బమ్మ నిజంగానే వీలునామా రాసింది కానీ___ ఆమె మనసులో దాచుకున్న ఒక చిన్న కోరిక మాత్రం ఎక్కడా రాయలేకపోయింది.“నా కొడుకు___ ఒక్కసారి___ నన్ను చూసి___ ప్రేమగా పిలవాలి___” అనేది సుబ్బమ్మ ఆఖరి కోరిక, అది తీరిందో లేదో___ఎవరికీ తెలియదు.సుబ్బమ్మది తల్లి ప్రేమ. అది ఏమీ అడగదు. ఎక్కడా ఆగదు. ఎప్పటికీ తగ్గదు. ఆ ప్రేమను గుర్తించాల్సింది ఆ కొడుకే. ఆమె అడిగిన “ఏం పాపం చేశానో___?” ప్రశ్నకి ఆ ఇంట్లో ఇప్పటికీ జవాబు లేదు.

-పండరినాథ్ ప్రభల
9666642767

## ఆ మూడు మాకొద్దు

"అన్నీ అంగాల్లాంటివే
మా దేహాల్లో ఇమిడిఉన్న
ఆ మూడు..
అవి ఉన్నందుకేగా
మాపై మీ దాష్టికాలు..
గుడులు బడులు
రైల్వేస్టేషన్లు హోటళ్ళు
ఎన్ని స్థలాలో మీకు..
మా అవయవాలను
ఛిద్రం చేయడానికి..
మా దేహాల రక్షణకు
కాసింత జాగా ఎక్కడుందో
ఏ మహాత్ముడు చెప్పగలడు?
ఇరవై ముప్పై మృగాల
మూకుమ్మడి దాడికి
ఛిద్రమయ్యేది మా దేహమే కాదు..
విలువలు దిగజార్చుకున్న
మీ నైతిక వికాసం కూడా..
ఆడతనానికి ప్రతీకలు
మా రెండు రొమ్ములు..
నీకు జన్మనిచ్చే అమ్మతనానికి ప్రతీక
మా దేహాల్లోని మర్మాంగం..
అమ్మలని అక్కలని మరచి
ఆడవాళ్ళంటే
ఆ మూడు అంగాల కుప్పలే
అని మగజాతి తలచినంతకాలం..
మా దేహాల్లోని రొమ్ములుమర్మాంగాన్ని
మాకు మేమే నిషేదించుకుంటాం..
సృష్టి ఆగిపోతే పోనీండి
మానవజాతి నశించిపోతే పోనీండి..
ఆడతనంలో అమ్మతనాన్ని
మీరు చూసినప్పుడే
మా అంగాలను పునఃసృష్టించుకుని
మాతృమూర్తులుగా
మళ్ళీ మీకు జన్మనిస్తాము
అంతవరకూ ఆ మూడు మాకొద్దు"



రోహిణి వంజారి
9000594630



## దహన సంస్కారాలకు ఆర్థిక వితరణ

**దమ్మపేట ,మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,దమ్మపేట మండల కేంద్రానికి చెందిన గాయత్రీ వైద్యశాల బృందం ఆదివారం దహనసంస్కారల నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు. వైద్యశాల బృందం తెలిపిన వివరాల ప్రకారం పట్వారిగూడెం పిహెచ్ సి పరిధిలో ఆశావర్కర్ గా విధులు నిర్వహిస్తున్న కొత్తూరు గ్రామానికి చెందిన కూరం శ్యామల అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందారు. వీరి కుటుంబ సభ్యులు నిరుపేదలు కావడంతో దహనసంస్కారాల కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారికి మానవతా దృక్పథంతో దమ్మపేట కు చెందిన గాయత్రీ వైద్యశాల బృంధం ఆర్థికంగా సహకరించారు. వీరిలో వైద్యశాల యాజమాన్యం తో పాటుగా వైద్యులు పి.మౌనిక ,సాయికృష్ణ , ఉదయ్ భాస్కర్ లు ఉన్నారు.

## దమ్మపేట తహశీల్దార్ గా మద్దినేని మురళీ నియామకం

**దమ్మపేట ,మహా :** ఏజెన్సీ మండల కేంద్రమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,దమ్మపేట మండల తహశీల్దార్ గా నేడు మద్దినేని మురళి పదవీ భాద్యతలు చేపట్టనున్నారు. గ్రూప్ 1లో అత్యధికంగా 83 వ ర్యాంకు సాధించిన మురళి మొదటిసారిగా తహశీల్దార్ భాద్యతలు చేపట్టబోతున్న తరుణంలో ఈ ప్రాంత ఏజెన్సీ చట్టాలపై ఉక్కుపాదం మోపుతారని అక్రమార్కుల గుండెల్లో ఇప్పటికే రైళ్ళు పరిగెడుతున్నాయి. గత కొన్నేళ్లుగా దర్జాగా ఆక్రమణలో ఉన్న భూబకాసురుల భరతం పట్టేందుకే జిల్లా కలక్టర్ అంకిత్ ఈ మండలం పై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ మండలంలో బరితెగించి మరీ భూములను ఎవరికి వారే దర్జాగా దొడ్డిదారిన ఆక్రమించుకోవడమే కాకుండా బ్రతికుండగానే రికార్డుల పరంగా చంపేసి మరీ భూ బదలాయింపు లు జరగడాన్ని కలక్టర్ ససేమిరా జీర్ణించుకోలేని పరిస్థితి ఎదురైంది. ఈ నేపథ్యంలో నే ఇటీవల జరిగిన పెద్దగొల్లగూడెం అక్రమ భూ బదలాయింపు విషయం రాష్ట వ్యాప్తంగా చర్చకు దారితీసింది. దీని విషయంలో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందనే ముందస్తు భయంతో అందుకు భాద్యులైన పెద్దగొల్లగూడెం జిపివో అనంత లక్ష్మీ , తహశీల్దార్ రామ్ నరేష్ లపై సస్పెన్షన్ వేటు వేసి చేతులు దులుపుకున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా గ్రూప్ 1లో ప్రతిభ కనబరచిన మద్దినేని మురళి నూతన తహశీల్దార్ గా సోమవారం పదవీబాధ్యతలు చేపట్టబోతున్నారు.ఏజెన్సీ చట్టాలను ఏమేరకు కాపాడుతారోనని స్థానిక రైతులు ఎదురు చూస్తున్నారు

# ఏజెన్సీలో గిరిజనేతర పేదల భూములకు రక్షణ కల్పించాలి

- అర్హులైన గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వాలి
- పోడు సాగుదారులపై ఫారెస్ట్ దాడులు నిలిపివేయాలని..
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) వినతిపత్రం




**మణుగూరు, మహా :** ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతర పేదల భూములకు చట్టబద్ధమైన రక్షణ కల్పించడంతో పాటు అర్హులైన గిరిజనులకు పోడు భూములపై పట్టాలు మంజూరు చేయాలని, పోడు సాగుదారులపై అటవీశాఖ అధికారులు చేపడుతున్న దాడులను తక్షణమే నిలిపివేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్. మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మణుగూరులోని ఇల్లందు గెస్ట్‌హౌస్‌లో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతర పేదలు దశాబ్దాలుగా గిరిజనులతో కలిసి జీవిస్తూ, తమకు ఉన్న కొద్దిపాటి ప్రభుత్వ భూములపై ఆధారపడి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గతంలో ఈ భూములకు ప్రభుత్వం భూమి శిస్తులు వసూలు చేసేదని, ఆ శిస్తు రసీదుల ఆధారంగా సహకార బ్యాంకుల ద్వారా రైతులకు రుణాలు కూడా అందించేవారని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో ప్రత్యేక రికార్డులు ఉండటంతో గిరిజనేతర పేదలకు భూములపై భరోసా ఉండేదని చెప్పారు. ఇటీవల కాలంలో భూమిశిస్తుల వసూళ్లు, సంబంధిత రికార్డుల నిర్వహణ నిలిచిపోవడంతో గిరిజనేతర పేదల భూములకు రక్షణ లేకుండా పోయిందని, దీంతో వేలాది కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి గిరిజనేతర పేదలకు భూములపై రక్షణ కల్పించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతంలోని అర్హులైన గిరిజనులందరికీ పోడు భూములపై పట్టాలు మంజూరు చేయడంతో పాటు పోడు సాగుదారులు, అటవీశాఖ అధికారుల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. పోడు సాగుదారులపై ఫారెస్ట్ అధికారులు జరుపుతున్న దాడులను నిలిపివేసి రైతులు ప్రశాంతంగా సాగు చేసుకునే పరిస్థితులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని, సంబంధిత అంశాలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆర్. మధుసూదన్ రెడ్డి తెలిపారు. మంత్రి ఇచ్చిన హామీని అమలు చేసి ఏజెన్సీ ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) నాయకులు ఎస్. రాములు, కె. నాగేశ్వరరావు, జి. వెంకటేశ్వర్లు, ఎం. సాంబశివరావు పాల్గొన్నారు.



## గోదావరి పుష్కరాల నాటికి దేవస్థానం పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలి

**భద్రాద్రి బ్యూరో, మహా:** గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పునరుద్ధరణ పనులను పూర్తిచేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన ఆయన, భక్తులకు ఇబ్బందులు కలగకుండా నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం ఆలయ పునరుద్ధరణకు రూ.351 కోట్లు, భూసేకరణకు సుమారు రూ.75 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఆలయ ప్రాచీన వైభవానికి భంగం కలగకుండా ఆగమశాస్త్రాలకు అనుగుణంగా పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.గోదావరి పుష్కరాల నేపథ్యంలో కొత్త స్నాన ఘాట్లు, యాత్రికుల సౌకర్యాలు, మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. దర్శనం, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత వంటి సౌకర్యాల్లో ఎలాంటి లోటు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.సమీక్ష సమావేశంలో ఆలయ పనుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలని, ప్రతి పది రోజులకు ఒకసారి పనుల పురోగతిని సమీక్షించాలని సూచించారు. పుష్కరాలకు 15 రోజుల ముందే అన్ని పనులు పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాలని, అవసరమైతే అదనపు కార్మికులను నియమించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్మాణాలు, శిల్పకళా పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు.

## టీపీసీసీ ఎస్సీ డిపార్ట్ మెంట్ రాష్ట్ర వైస్ చైర్మన్ గా నారపోగు వెంకటేశ్వర్లు..

**తల్లాడ జులై, 19, (మహా ):** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర వైస్ చైర్మన్ గా ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన నారపోగు వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ రాజేంద్ర పాల్ గౌతమ్ నుండి నియామకపు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కు ప్రత్యేక శుభాకాంక్షలు ధన్యవాదాలు తెలిపారు. తన నియమకానికి సహకరించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, టిపిసిసి ఎస్సి డిపార్ట్మెంట్ చైర్మన్ కవంపల్లి సత్యనారాయణ, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర ఇరిగేషన్ చైర్మన్ మువ్వా విజయబాబుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీలు అధికంగా ఉన్నారని, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరి దృష్టికి తీసుకెళ్తానని, పార్టీ మరలా అధికారంలో రావడానికి కృషి చేస్తానని వెంకట్ అన్నారు.



## ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

- సింగరేణి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- రొంపేడు గ్రామంలో 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన
- నూతన 33/11కెవి విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించి ప్రజలకు అంకితం

**భద్రాద్రి బ్యూరో, మహా:** ప్రజలకు నాణ్యమైన అంతరాయం లేని విద్యుత్ సరఫరాను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొంటూ సింగరేణి అభివృద్ధి ఉద్యోగుల సంక్షేమం గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు జిల్లా కలెక్టర్ అంకిత్ మర్యాదపూర్వకంగా పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి ఇల్లందు మండలం రొంపేడు గ్రామంలో నూతనంగా 3కోట్ల 25 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న 33/11కెవి విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయగా, టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్ రోడ్ వద్ద నూతనంగా నిర్మించిన 33/11కెవి విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి ప్రసారం పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేస్తూ విద్యుత్ మౌలిక సదుపాయాలను వేగంగా విస్తరిస్తున్నట్లు తెలిపారు. కొత్త విద్యుత్ ఉపకేంద్రాల ఏర్పాటు విద్యుత్ లైన్ల ఆధునికీకరణ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాల పెంపు వంటి కార్యక్రమాలను ప్రాధాన్యతతో అమలు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో సింగరేణి సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సంస్థ అభివృద్ధి ఉత్పత్తి సామర్థ్యాల పెంపు ఉద్యోగుల సంక్షేమం భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా బొగ్గు వనరుల వినియోగం కోసం ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోందన్నారు. సింగరేణి ప్రాజెక్టుల ప్రభావిత నిర్వాసితులకు న్యాయం చేయడంతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. సింగరేణి కార్మికులతో పాటు విద్యుత్ రంగ సంస్థల ఉద్యోగుల భద్రత కోసం ప్రమాద బీమా పథకాలు అమలు చేస్తున్నామని ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రూ.1.20 కోట్ల ప్రమాద బీమా రక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు.

గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా విస్తృత కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. పోడు భూముల హక్కులు పొందిన గిరిజన రైతుల వ్యవసాయాభివృద్ధి కోసం ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ద్వారా ఉచిత సౌర విద్యుత్ బోర్ బావులు పంపుసెట్లు డ్రిప్ స్ప్రింక్లర్ ఇరిగేషన్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పుల కారణంగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్నప్పటికీ ప్రజలకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేలా విద్యుత్ శాఖ అప్రమత్తంగా పనిచేస్తోందన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912 టోల్ ఫ్రీ సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. వైద్యరంగంలోని 108 అత్యవసర సేవల తరహాలో విద్యుత్ శాఖలో ప్రవేశపెట్టిన 'పవర్ అంబులెన్స్' సేవల ద్వారా ట్రాన్స్‌ఫార్మర్లు వైర్లు అవసరమైన పరికరాలు సాంకేతిక సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 165 పవర్ అంబులెన్స్‌లు ప్రజలకు సేవలందిస్తున్నట్లు వెల్లడించారు.

ఎల్‌నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. తాగునీటి వనరుల పరిరక్షణ వన్యప్రాణులకు నీటి లభ్యత వ్యవసాయ రంగానికి అవసరమైన చర్యలు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల్లో అవగాహన కల్పించడంలో మీడియా అధికారులు ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రొంపేడు, ముత్యాలంపాడు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ ఉపకేంద్రాల ద్వారా విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత బలోపేతమై విద్యుత్ లోడ్ సమతుల్యం కావడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన అంతరాయం లేని విద్యుత్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయంగా పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ రెడ్డి, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, వైరా శాసనసభ్యులు రామదాస్ నాయక్, సింగరేణి, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూ రీ సర్వే పనుల్లో జాప్యాన్ని ఉపేక్షించేది లేదు

- భూముల రీ సర్వే నిర్ణీత గడువులో పూర్తి చేయాలి
- రెవెన్యూ అటవీ పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి
- శ్రీనివాసగుట్టను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**భద్రాద్రి బ్యూరో, మహా:** భూముల రీ సర్వే, అటవీ రెవెన్యూ సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని పనుల్లో జాప్యాన్ని ఉపేక్షించేది లేదని భూముల రీ సర్వే నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి
రెవెన్యూ అటవీ పోలీసు శాఖలు సమన్వయంతో పని చేయాలని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని శ్రీనివాసగుట్టను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని
రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భూముల రీ సర్వే పనుల పురోగతి, అటవీ రెవెన్యూ భూ సమస్యల పరిష్కారం పోడు భూముల అంశం పాల్వంచ శ్రీనివాసగుట్ట అభివృద్ధిపై జిల్లా అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.

సమావేశంలో జిల్లాలో 70 గ్రామాల్లో చేపడుతున్న భూముల రీసర్వే పనుల పురోగతిని మంత్రి సమీక్షించారు. అధికారులు జిల్లాలో ప్రస్తుతం 14 గ్రామాల్లో రీ సర్వే పనులు కొనసాగుతుండగా వాటిలో ఐదు గ్రామాల్లో పనులు పూర్తయ్యాయని వివరించారు. మిగిలిన గ్రామాల్లో కూడా నిర్ణీత గడువులో రీ సర్వే పూర్తి చేసేలా కార్యాచరణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

పాల్వంచలో కొనసాగుతున్న సర్వే పనుల పురోగతిపై మంత్రి ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసి చాలా కాలం గడిచినా పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. రీ సర్వే పనుల్లో జాప్యాన్ని పొరపాట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పనుల్లో జాప్యానికి గల కారణాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూముల రీ సర్వే ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని మంత్రి సూచించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న సర్వేయర్లు రోవర్ పరికరాలు వాటి వినియోగం సాంకేతిక సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకుని అవసరమైన చోట అదనపు వనరులు సమకూర్చాలని సూచించారు.

జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలను పోలీస్ శాఖ వారు గుర్తించి ఆయా ప్రాంతాల్లో ఉన్న భూ వివాదాలు, అటవీ రెవెన్యూ సమస్యలను సామరస్యపూర్వకంగా చట్టబద్ధంగా పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ అటవీ పోలీసు శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. ప్రతి నెలా సమీక్ష సమావేశాలు నిర్వహించి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

**కొత్తగా పోడు సాగు జరగకుండా చర్యలు తీసుకోవాలి...**

కొత్తగా పోడు సాగు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గతంలో పోడు సాగు చేస్తున్న వారి సమస్యలను ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా మానవీయ కోణంలో పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

అనంతరం పాల్వంచలోని శ్రీనివాసగుట్ట అభివృద్ధిపై మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. శ్రీనివాసగుట్టపై వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు సులభంగా చేరుకునే విధంగా రహదారి నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే శ్రీనివాసగుట్ట ప్రాంతాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేలా సమగ్ర ప్రణాళిక రూపొందించి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లాలో భూముల రీ సర్వే అటవీ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను మంత్రికి వివరించారు. జిల్లాలో దశలవారీగా రీ సర్వే పనులు కొనసాగుతున్నాయని ప్రస్తుతం 14 గ్రామాల్లో పనులు చేపట్టగా ఐదు గ్రామాల్లో పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన గ్రామాల్లో కూడా నిర్ణీత గడువులో సర్వే పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామని చెప్పారు. రెవెన్యూ అటవీ పోలీసు శాఖల సమన్వయంతో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియ నిర్వహిస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ,అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, కొత్తగూడెం ఆర్డీవో మధు, డివిజనల్ అటవీ అధికారులు, రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖల అధికారులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన హక్కుల సాధనకు కదలాలి

- ఏజెన్సీ చట్టాల పటిష్టంకోసం సమష్టిగా ఉద్యమించాలి
- పోడు సాగుదారులపై దాడులు నిర్బంధాలను ప్రతిఘటించాలి
- అటవీ హక్కులను పరిరక్షణ
- పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయి
- అఖిలభారత ఆదివాసి మహాసభ ఇంచార్జి అని రాజా



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** గిరిజన హక్కుల సాధనకు, ఏజెన్సీ చట్టాల పరిరక్షణకు గిరిజన లోకం ఐక్యంగా కదలాల్సిన అవసరం ఉందని అఖిలభారత ఆదివాసి మహాసభ ఇంచార్జి అని రాజా పిలుపునిచ్చారు. తెలంగాణ గిరిజన సమాఖ్య(టీజీఎస్) రాష్ట్ర తృతీయ మహాసభల సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్ అమరజీవి సోయం రంగులు నగర్ టాను నాయక్ ప్రాంగణంలో ఆదివారం అత్యంత ఉత్సాహంగా రెండో రోజు ప్రతినిధుల సభ జరిగింది. టీజీఎస్ పతాకాన్ని గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు కల్లూరు వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాలకుల ప్రజావ్యతిరేక విధానాల వల్ల గిరిజన ప్రాంతాల్లో హక్కులు కాలరాయబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తరతరాలుగా అడవిని నమ్ముకుని బతుకుతున్న గిరిజన బిడ్డలను భూములకు దూరం చేసే కుట్రలను తిప్పికొట్టాలన్నారు. పోడు సాగుదారులకు పూర్తి రక్షణ కల్పించే వరకు, గిరిజన సంక్షేమం సిద్ధించే వరకు రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

**గిరిజన హక్కుల రక్షణకు సిద్ధమవ్వాలి..**

ఐక్య ఉద్యమాలతోనే గిరిజన హక్కుల రక్షణ న్యాయం సాధ్యమవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రతినిధుల సభలో ఆయన మాట్లాడుతూ పాలకుల అణచివేత వైఖరిని గిరిజన లోకం ఐక్యంగా ఎదుర్కోవాలన్నారు. గిరిజన భూములపై ఎలాంటి నిర్బంధాలను పెట్టినా సహించేది లేదని అడవిపై సర్వహక్కులు గిరిజనులవేనని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజా పక్షాన ఉంటూ బలమైన ఉద్యమాలను నిర్మించి గిరిజన బిడ్డలకు పూర్తి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.గిరిజన సమాఖ్య బలోపేతం ద్వారానే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని రాష్ట్ర టీజీఎస్ ప్రధాన కార్యదర్శి అంజయ నాయక్ పేర్కొన్నారు. ప్రతినిధుల సభలో ఆయన కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత కాలంగా గిరిజన హక్కుల కోసం చేసిన ఉద్యమాలను భవిష్యత్తు కార్యాచరణను నివేదికలో పొందుపరిచామన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పోడు భూముల పట్టాల పంపిణీని తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన విద్యా వైద్య రంగాల బలోపేతం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ప్రవేశపెట్టిన నివేదికపై ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించి పలు అంశాలపై మహాసభలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.పోలవరం పేరుతో ఆదివాసీల జల సమాధి పోలవరం ప్రాజెక్టు పేరుతో సుమారు రెండు లక్షల మంది ఆదివాసీలను జల సమాధి చేస్తున్నారని తరతరాలుగా అడవిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న అమాయకులను అభివృద్ధి పేరుతో అడవుల నుండి దూరం చేసి సహజ వనరులను కొల్లగొట్టేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మండిపడ్డారు. గిరిజన హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రామ్మూర్తి నాయక్, అంజయ్య నాయక్, సిపిఐ టిజిఎస్ నాయకులు ముత్యాల విశ్వనాథం, మేయర్ మూడ్ గణేష్, నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వి.పూర్ణచంద్రరావు, అడుసుమిల్లి సాయిబాబా, భూక్య దశ్రు, ఉప్పు శెట్టి రాహుల్, భూక్య శ్రీనివాస్, సోందే కుటుంబరావు, వెంకట్ రాష్ట్ర జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బోనమెత్తిన బోనగిరి

- కోట మైసమ్మకు కుమ్మర్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాల సమర్పణ
- అంటువ్యాధులు, విషజ్వరాలు దరిచేరకుండా అమ్మవారిని వేడుకున్న భక్తులు

**యాదాద్రి భువనగిరి జూలై 19 మహా :** ఆషాఢ మాసం సందర్భంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలు భువనగిరిలో భక్తి శ్రద్ధల మధ్య ఆదివారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని కోట మైసమ్మ గ్రామదేవత ఆలయంలో తొలి సారిగా కుమ్మర్ల సంఘం ఆధ్వర్యంలో తొలి బోనాన్ని ఘనంగా సమర్పించారు. వర్షాకాలంలో కొత్త నీరు, వాతావరణ మార్పులతో ప్రబలే అంటువ్యాధులు, విషజ్వరాల నుంచి ప్రజలను కాపాడాలని అమ్మవారిని వేడుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా 23వ వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత-జహంగీర్ బోనం ఎత్తి కోట మైసమ్మకు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు, తలంబ్రాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలు, భక్తుల జైజై ధ్వానాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జహంగీర్, మున్సిపల్ వైస్ చైర్మన్ పోతం శెట్టి మంజుల, కౌన్సిలర్లు బెండస్వరూపా లాల్ రాజ్, జాలిగం విగ్నేష్,కుమ్మర్ల పెద్ద తాడూరి బాలమల్లయ్య, తాడూరి కిష్టయ్య, తాడూరి నరసింహ, బండారు రవివర్ధన్ కాల్య నాగరాజు, మాటూరి ఆంజనేయులు, గాయపాక స్వామి, గుడ్డెంకి లక్ష్మీ నరసయ్య, గోపి బాబు, బర్రె క్రాంతి,ఎడ్ల భరత్ తదితరులు పాల్గొన్నారు

# రైతులు వాతావరణానుకూల సాగు పై అవగాహన పెంచుకోవాలి

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- ఆరుతడి పంటల పై రైతులకు అవగాహన తప్పనిసరి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, మహా;** మారుతున్న వాతావరణ పరిస్థితులు, నీటి వనరుల లభ్యతకు అనుగుణంగా రైతులు పంటల సాగు విధానాన్ని మార్చుకుని శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రైతులకు సూచించారు. ఆదివారం నర్సంపేట రైతు వేదికలో ఏర్పాటుచేసిన నీటి వనరుల లభ్యత వర్షాభావ పరిస్థితులు అలాగే ఆరుతడి పంటలపై రైతులతో వారు పాల్గొని రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన కల్పించడమైనది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నర్సంపేట డివిజన్ పరిధిలో 6 మండలాల పరిధిలోని రైతులు వర్షాభావ పరిస్థితుల దృశ్య ప్రభుత్వ నిర్దేశాల మేరకు రైతులు ప్రత్యామ్నాయ పంటలకు వెళ్లాల్సిందిగా వారు సూచించారు.

నర్సంపేట నియోజక వర్గ పరిధిలో మొత్తం 1,30 వేల ఎకరాల వ్యవసాయ సాగు చేస్తున్నాం అని, ఇట్టి సాగు పాకాల చెరువు,రంగయ్య చెరువు,మాదన్నపేట చెరువు కింద సాగుచేయడం జరుగుతుంది. మిగతా చిన్న చిన్న చెరువులు, బోర్ల ద్వారా పడుతున్నాయని, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఎల్ నినో ప్రభావం వలన మబ్బులు కనిపిస్తున్నాయి కాని ,వర్షాలు పడక పోవడం, లేదా అధిక వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం నిర్దేశించిన ఆరుతడి పంటలు వేసుకోవాలని వారు పేర్కొన్నారు.రానున్న కాలంలో రైతులు ఎలాంటి పంటలు పండించాలి అనే దాని కార్యచరణ ప్రణాళికలు చేయాలని అందుకు అధికార యంత్రాగం కృషి చేయాలని అన్నారు. యాసంగి ప్రణాళికలు కూడా సిద్ధం చేసేలా క్షేత్రస్థాయి అధికారులు కృషి చేయాలన్నారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..**

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, నీటి లభ్యతలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. ముఖ్యంగా నీటి వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని ఆరు తడి పంటల సాగుపై శాస్త్రీయ సూచనలను పాటించాలని సూచించారు. వ్యవసాయం, ఉద్యానవనం, నీటిపారుదల, భూగర్భ జలాలు, వాతావరణ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన వివరాలను రైతులకు వివరించి, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి,నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, జెడ్పి సీఈవో రామ్ రెడ్డి వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, జిల్లా హార్టికల్చర్ అధికారి శ్రీనివాసరావు, ఎలక్ట్రిసిటీ ఎస్ ఈ ఆనందం, ఇరిగేషన్ ఎస్. ఈ, సంబంధిత మండలాల తహసిల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## ఆలేరులో ఘనంగా జగన్నాథ స్వామి రథయాత్ర

- పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**యాదాద్రి భువనగిరి జూలై 19 మహా**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో అత్యంత వైభవంగా ఆదివారం నిర్వహించిన జగన్నాథ స్వామి రథయాత్రలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సంప్రదాయబద్ధంగా జగన్నాథ స్వామి రథాన్ని తాడుతో లాగి స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే భక్తి, వినయానికి ప్రతీకగా బంగారు, వెండి చీపురుతో రథం ముందు ఊడ్చే సేవ (చేరా పహారా సేవ) నిర్వహించి స్వామివారికి తన భక్తిని చాటుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ జగన్నాథ స్వామి వారి కృపతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రంలో శాంతి, సుభిక్షాలు నెలకొనాలని ప్రార్థించినట్లు




# బస్వాపురం ప్రాజెక్టు నుండి నీటిని విడుదల చేసి ప్రాజెక్టు పరిధిలోని చెరువులు నింపాలి

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్ డిమాండ్**

**యాదాద్రి భువనగిరి జులై 19 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లాలోని బస్వాపురం ప్రాజెక్టు నుండి నీటిని విడుదల చేసి ప్రాజెక్టు పరిధిలోని చెరువులను నింపి రైతాంగానికి సాగునీరు అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి. జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రాజెక్టులో భూములు, ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించి, ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని అన్నారు. ఆదివారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బస్వాపురం ప్రాజెక్టులోనీ నీటిని పరిశీలన చేసిన అనంతరం ప్రాజెక్టు కట్టపైన ఉన్న గేట్ల దగ్గర నీటిని విడుదల చేయాలని ధర్నా నిర్వహించారు అనంతరం జహంగీర్ మాట్లాడుతూ జిల్లా అత్యంత కీలకంగా రైతాంగానికి ఉపయోగపడే బస్వాపురం ప్రాజెక్టును పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రాజెక్టులో నిలువ ఉన్న 0.6 టీఎంసీల నీటిని వెంటనే విడుదల చేయడం వల్ల జిల్లా పరిధిలోని ఐదారు మండలాల్లోని చెరువులు నింపితే రైతాంగానికి ఈ వర్షా బావ పరిస్థితులలో సాగుకు ప్రధానంగా ఉపయోగపడుతుందని తెలిపారు. స్థానిక చెరువులు, కుంటలు నింపడం వల్ల భూగర్భ జలమట్టం పెరిగి బోర్లలో, బావుల్లో కూడా నీళ్లు వస్తాయని దీనివల్ల సాగు, త్రాగు నీటి సమస్య కూడా పరిష్కారం అవుతుందని తెలియజేశారు. ప్రాజెక్టులో నీళ్లు ఉన్న వాటిని విడుదల చేసి రైతాంగానికి అందించడం స్థానిక శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్, నీటి పారుదల శాఖ జిల్లా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ, బట్టుపల్లి అనురాధ, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, మాయ కృష్ణ , భువనగిరి మండల పార్టీ కార్యదర్శి పల్లెర్ల అంజయ్య , ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు అన్నంపట్ల కృష్ణ , కొండ అశోక్క , భువనగిరి పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు గంధమల్ల మాతయ్య , మండల కమిటీ సభ్యులు మోటె ఎల్లయ్య , కళ్లెం లక్ష్మి నరసయ్య, టౌన్ కమిటీ సభ్యులు బర్ల వెంకటేష్, మండల పరిషత్ మాజీ కో ఆప్షన్ యండి బాబు, బస్వాపురం మాజీ శాఖ కార్యదర్శి నరాల చంద్రయ్య , శాఖ సహాయ కార్యదర్శి రాసాల దెవెందర్, నమాత్ పల్లి శాఖ కార్యదర్శి జిట్ట అంజిరెడ్డి , సీపీఎం సభ్యులు, రైతులు బండి శ్రీను, తెల్జూరి మాణిక్యం, గోదల వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ కమిషనరేట్ పరిధిలో వరుస దాడులు

- నగరంలో పేట్రేగిపోతున్న గుండాలు.. పట్టించుకోని ఖాకీలు
- అడుప మహేష్ ఘటన మరువక ముందే మరో దాడి
- పోలీసుల వైఖరి పై మండి పడుతున్న నగర ప్రజలు



**వరంగల్, క్రైం;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రౌడీషీటర్లు, గుండాలు, భూకబ్జాదారులు పేట్రేగిపోతున్నారు.వీరి అరాచకాల వల్ల సామాన్య ప్రజలు భయంతో వణికిపోతున్నారు.కొంతమంది రాజకీయ నాయకుల అండదండలు రౌడీలకు భూకబ్జాదారులకు ఉండడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని నగర ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు.. నగరంలో శనివారం ఆదివారం వరుసగా జరిగిన రెండు ఘటనలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఏనుమాముల మార్కెట్ పరిధిలో రౌడీ షీటర్ పత్తి కుమార్ కాంగ్రెస్ కార్యకర్త అడుప మహేష్ పై పెట్రోల్ పోసి నిప్పంటించారు దీంతో ఆయన 80 శాతం కాలిన గాయాలతో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ మృతి చెందాడు. ఆ ఘటన మరువక ముందే హనుమకొండ బాలసముద్రంలోని శ్రీనివాస కాలనీలో ప్రభుత్వ భూములను ఆక్రమించే ఒక కుటుంబం మరో వ్యక్తి పై అత్యంత భయానక పరిస్థితుల్లో కర్రలు రాళ్లతో విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డారని తెలుస్తోంది. ఈ దాడి ఘటన సీసి పుటేజీలో రికార్డు కావడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. 15 రోజుల క్రితమే ఆ వ్యక్తుల పై బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో వారు నేరుగా ఈ దాడికి పాల్పడ్డారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సమాజానికి చీడ పురుగుల్లా తయారైన ఇటువంటి వ్యక్తుల పట్ల పోలీసులు మెతక వైఖరి ప్రదర్శించడం పట్ల స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. ఇటీవల నూతన పోలీస్ కమిషనర్ గా వచ్చిన శ్వేతా రెడ్డి ఇప్పటికైనా శాంతిభద్రతలు గాడి తప్పడం పై ప్రత్యేక దృష్టి సారించాలని నగర ప్రజలు, ప్రముఖులు కోరుకుంటున్నారు.

## రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలతో వాహనదారుల ఇబ్బందులు.



**కుషాయిగూడ, మహా :** జవహర్ నగర్ లో 100 ఫీట్ల ప్రధాన రహదారి విస్తరణ లెవలింగ్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. అయితే రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండానే పనులు చేస్తుండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సందర్భంగా జవహర్ నగర్ దారి గుండా వెళ్లే వాహనదారుల బాధలు వర్ణనాతీతం. ఇకనైనా అధికారులు వాటిని తొలగించి రోడ్డు వేసి ఉంటే బాగుండేదని ఇప్పటికైనా స్తంభాలను పక్కకు జరిపి రోడ్డు విస్తరణ పనులను చేపట్టాలని, తద్వారా ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు వాహనదారులు, కోరుతున్నారు.



# నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ భరోసా..

- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోటె శ్రీశైలం
- రోగి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**ఇబ్రహీంపట్నం జూలై 19 మహా:** స్థానిక ఎమ్మెల్యే రంగారెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి, ఆపద సమయంలో అండగా నిలుస్తుందని మోటే శ్రీశైలం అన్నారు. ప్రజా పాలనలో భాగంగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయం వారి జీవితాల్లో భరోసాను నింపుతూ, ఆపద సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తుందని మోటే శ్రీశైలం అన్నారు. ఆదివారం యాచారం మండలం, మాల్ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న, మందడి జంగారెడ్డి, యెస్కుల్ల రాములయ్య, అనే పేద మధ్యతరగతి కుటుంబాలకు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో, ముఖ్యమంత్రి సహాయ నిధుల నుండి మంజూరైన 98వేల రూపాయల విలువైన చెక్కులను, యాచారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోటె శ్రీశైలం, మాల్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతమోని శ్రీకాంత్ గౌడ్ చేతుల మీదుగా, రోగి కుటుంబ సభ్యులకు సంయుక్తంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కవిత శేఖర్, మాజీ సర్పంచ్ పద్మ జంగీర్, సీనియర్ నాయకులు లిక్కీ రాజా రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గెణమోని గోపాల్, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పొలమోని రామకృష్ణ యాదవ్, యాచారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జయప్రకాష్ (జగన్), మాల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దేరంగుల రమేష్, గిరి గాలయ్య, మాస బాలరాజ్, మాజీ 4వ వార్డు సభ్యులు దేరంగుల్లా కృష్ణ, అండేకర్ రవి, షెల్లీ దేవధర్, గుండంట్ల కృష్ణ, దేరంగుల్లా ఈశ్వర్, ఆడాల శ్రీకాంత్, బన్నె జంగయ్య, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**

**యాదాద్రి భువనగిరి జూలై 19 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల చేనేత సహకార సంఘం నూతన చైర్మన్ మరియు పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతనంగా చైర్మన్‌గా ఎన్నికైన దాసి శంకర్ పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం, ఆయనను చైర్మన్ కుర్చీలో కూర్చోబెట్టి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అభినందనలు తెలిపారు. నూతన పాలక మండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ, సన్మానం చేసి,చేనేత రంగ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

# చిరు వ్యాపారులకు అండగా ఉంటాం

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**యాదాద్రి భువనగిరి జూలై 19 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో గిరిజన తండాలకు చెందిన మహిళలు, చిరు వ్యాపారస్తులు సంప్రదాయ పద్ధతిలో జొన్న రొట్టెలు తయారు చేసి విక్రయిస్తున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆదివారం స్వయంగా అక్కడ ఆగి వారి వద్ద నుంచి జొన్న రొట్టెలను కొనుగోలు చేశారు.ఈ సందర్భంగా గిరిజన మహిళలతో ఆప్యాయంగా మాట్లాడిన ఎమ్మెల్యే వారి కుటుంబ పరిస్థితులు, వ్యాపారం సాగుతున్న తీరు, ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సంప్రదాయ ఆహార పదార్థాలకు ప్రజల్లో మంచి ఆదరణ పెరుగుతోందని, జొన్న రొట్టెలు వంటి ఆరోగ్యకరమైన ఆహారాలను ప్రజలు మరింత ప్రోత్సహించాలని సూచించారు.గిరిజన మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబాలను పోషించడం అభినందనీయమని పేర్కొన్న బీర్ల అయిలయ్య , చిన్న వ్యాపారాలను ప్రోత్సహించడం ద్వారా వారి ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని అన్నారు. గిరిజనులు, పేద చిరు వ్యాపారస్తుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, తమకు అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## అంగరంగ వైభవంగా బోనాలు పండుగ

**కమిటీ సభ్యులు.**

**కుషాయిగూడ, మహా :** జవహర్ నగర్ మహంకాళి బోనాల పండుగ తేదీలను ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆగస్టు 23వ తేదీ ఆదివారం రోజు బోనాల పండుగ అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని, అలాగే ఆగస్టు 24వ తేదీన సోమవారం రంగం జాతర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. వైభవంగా జరిగే ఈ ఉత్సవాలలో జవహర్ నగర్ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవార్ల కరుణాకటాక్షాలకు పాత్రులు కావాలని జవహర్ నగర్ బోనాల పండుగ ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ రాజు గౌడ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం బోనాల పండుగ ఘనంగా నిర్వహిస్తున్నామని జవహర్ నగర్ లోని ప్రజలందరూ ఈ వేడుకకు హాజరుకావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, కోటేష్ గౌడ్, బండ కింది ప్రసాద్, ప్రవీణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# హస్తంలో ముదిరిన వర్గపోరు..కాంగ్రెస్ నాయకుడు బలి

- వరంగల్ కాంగ్రెస్ లో ఆధిపత్య పోరు
- మితిమీరి పోతున్న రౌడీషీటర్ల ఆగడాలు
- రౌడీ షీటర్ల హస్తం పై స్థానికంగా, రాజకీయంగా చర్చ



**వరంగల్, మహా ;** వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ లో రాజకీయ కక్ష సాధింపు తారస్థాయికి చేరింది. హస్తం లో అంతర్గత వర్గ పోరుకు ఓ సీనియర్ నాయకుడి నిండు ప్రాణం బలిగొంది. వర్ధన్నపేట నియోజకవర్గం వరంగల్ నగర పరిధిలోని 14 వ డివిజన్ మాజీ అధ్యక్షుడు కాంగ్రెస్ నాయకుడు అడుప మహేష్ (45) పై ఓ పథకం ప్రకారం నిందితులు శనివారం రాత్రి పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనతో వరంగల్ ఉమ్మడి జిల్లా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ దాడిలో కాంగ్రెస్ నాయకుడు మహేష్ తీవ్ర గాయాలతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా ఆదివారం భువనగిరి పట్టణం చేరుకోక ముందే మార్గమధ్యంలోనే మృతి చెందాడు. ఈ ఘటనతో జిల్లా కాంగ్రెస్‌లోని వర్గ రాజకీయాలు, నాయకుల మధ్య ఆధిపత్య పోరు మరోసారి బహిర్గతమైంది. వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ లో కొన సాగుతున్న అంతర్గత వర్గపోరు చివరకు ఒక నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది.

**పోలీసుల కథనం ప్రకారం..**

శనివారం రాత్రి జన్ను మధు అడుప మహేష్‌కు ఫోన్ చేసి మాట్లాడాల్సిన పని ఉందంటూ గొర్రెకుంట లోని కోటిలింగాల దేవాలయం వద్దకు మహేష్ ను పిలిపించాడు. మొదట మహేష్ రావడానికి నిరాకరించినప్పటికీ, నమ్మించి అక్కడికి రప్పించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం మహేష్ కు మద్యం తాగించిన తర్వాత పథకం ప్రకారం పత్తి కుమార్ అక్కడికి చేరుకుని, వర్ధన్నపేట ఎమ్మెల్యే కు నా గురించి ఎందుకు చెడుగా చెబుతున్నావు.. నేనంటే నీకు భయం లేదా?" అంటూ వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. ఆ తర్వాత ముందస్తు కుట్ర లో భాగంగా మహేష్ పై పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేసేందుకు ప్రయత్నించగా మహేష్ అక్కడి నుండి కాలిన గాయాలతో తప్పించు కున్నాడని పోలీసులు వెల్లడించారు.

**పరారీలో నిందితులు.. పోలీసుల గాలింపు**

మహేష్ భార్య అడుప నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు పత్తి కుమార్, జన్ను మధు తో పాటు మరికొందరి పై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. కాగా మహేష్ మృతి చెందడంతో ఈ కేసును హత్య కేసు గా మార్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ప్రధాన నిందితుడు పత్తి కుమార్ పై గతంలో కూడా హత్య కేసుతో పాటు పలు క్రిమినల్ కేసులు నమోదై ఏనుమాముల పోలీస్ స్టేషన్ లో రౌడీ షీట్ కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం నిందితులు పరారీలో ఉండగా, ప్రత్యేక పోలీసు బృందాలు వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి.

**ఘటన పై రాజకీయ వర్గాల్లో చర్చ**

స్థానిక ఎమ్మెల్యే నుంచి మంత్రి వరకు వీరిని ప్రసన్నం చేసుకోవడానికి ఇటీవల అధికార పార్టీకి మారిన నేతలకు కాంగ్రెస్ పార్టీ నే నమ్ముకున్న సీనియర్ నాయకులకు కార్యకర్తల మధ్య వర్గ విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయని పార్టీలో బహిరంగ చర్చ సాగుతోంది. వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ లో కొనసాగుతున్న వర్గ విభేదాలే ఈ దారుణ ఘటనకు కారణమన్న చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ఒకే పార్టీకి చెందిన నాయకుల మధ్య నెలకొన్న వ్యక్తిగత కక్షలు, ఆధిపత్య పోరు చివరకు ఓ సీనియర్ కార్యకర్త ప్రాణాలను బలి గొనడం జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. స్థానిక నేతలు పార్టీలో క్రిమినల్ చరిత్ర ఉన్న వారికి చోటు కల్పించడం వల్లే ఇలాంటి దుర్ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రౌడీ షీటర్ల పేరుతో ప్రజలను బెదిరించే వారి పై చట్ట రిత్యా కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని పోలీసులు స్పష్టం చేసినప్పటికీ రాజకీయ నాయకుల అండతో రౌడీషీటర్లు శాంతి భద్రతలకు విఘాతం కలిగించడమే కాకుండా నేరాలకు పాల్పడుతూ హత్యలు చేయడానికి కూడా వెనుకాడడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.ఇప్పటికైనా రాజకీయ నాయకులు తమ స్వార్థ రాజకీయాలు పక్కనపెట్టి ప్రజా క్షేమం కోసం రౌడీషీటర్లు ఆగడాలకు చెక్ పెట్టే విధంగా పోలీసులకు చట్టపరంగా పూర్తి స్వేచ్ఛను ఇవ్వాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# జన నాయగన్ విడుదలకు సర్వం సిద్ధం

**జూలై 23న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్.**



**చెన్నై , మహా :** తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు విజయ్ నటుడిగా వీడ్కోలు పలుకుతున్న చివరి చిత్రం 'జన నాయగన్' జూలై 23న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది. హెచ్. వినోద్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. రాజకీయాల్లోకి పూర్తిస్థాయిలో అడుగుపెట్టిన విజయ్‌కు ఇది చివరి సినిమా కావడంతో అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది.
ప్రపంచవ్యాప్తంగా సుమారు 3,000 థియేటర్లలో, తమిళనాడులోనే దాదాపు 950 స్క్రీన్లలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. సినిమా విడుదల సందర్భంగా ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా ఉండేందుకు నిర్మాతలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రభుత్వ నిర్దేశించిన ధరలకే టికెట్లు విక్రయించాలని థియేటర్ యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అధిక ధరలకు టికెట్లు విక్రయిస్తే రాజకీయ విమర్శలకు అవకాశం ంటుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి 'A' సర్టిఫికెట్ జారీ చేసింది. దీంతో 18 ఏళ్లలోపు ప్రేక్షకులను థియేటర్లలోకి అనుమతించవద్దని చిత్రబృందం సూచించింది. సుదీర్ఘ న్యాయపోరాటం, సెన్సార్ ప్రక్రియ అనంతరం ఈ చిత్రానికి సర్టిఫికెట్ లభించింది. కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభమై మంచి స్పందన లభిస్తోంది. తమిళనాడులో కూడా బుకింగ్స్ ప్రారంభమైన వెంటనే అభిమానులు పెద్ద ఎత్తున టికెట్లు బుక్ చేస్తున్నట్లు సమాచారం. ఫస్ట్ డే ఫస్ట్ షో కోసం అభిమానులు భారీగా ఆసక్తి చూపుతున్నారు.
విజయ్ సినీ ప్రయాణానికి 'జన నాయగన్' ముగింపు పలుకుతున్న చిత్రం కావడంతో విడుదలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు చిత్రబృందం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అభిమానుల సంబరాలు, భారీ జనసందోహాన్ని దృష్టిలో ఉంచుకుని థియేటర్లు, స్థానిక అధికారులు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

# 'ఇక భయాలు లేవు..

*** నా గొంతుకను నేనే ఎంచుకుంటా'.**
*** అనుపమ భావోద్వేగ పోస్ట్ వైరల్.**



**హైదరాబాద్ , మహా :** ప్రముఖ నటి అనుపమ పరమే ్వరన్ సోషల్ మీడియాలో చేసిన తాజా పోస్ట్ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. తన జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని, ఇకపై ఎలాంటి అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదని, భయాలకు తావు లేదని పేర్కొంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. "నా గొంతుకను నేనే ఎంచుకుంటా" అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగంగా స్పందించిన అనుపమ.. "కొన్నిసార్లు ప్రశాంతతను పొందాలంటే కొన్ని విషయాలను వదులుకోవాల్సి ఉంటుంది. ఈ రోజు నాకు ఆ ప్రశాంతత దొరికింది. ఇకపై నా గొంతుకను, నా జీవితాన్ని నేనే ఎంచుకుంటాను. ఇక అనుమతులు లేవు.. భయాలు లేవు. నన్ను నేను తిరిగి కనుగొంటూ నా జీవితాన్ని ప్రేమిస్తున్నాను" అని రాసుకొచ్చారు. చాలా కాలంగా చెప్పాలనుకున్న విషయాన్ని ఇప్పుడు చెబుతున్నానని, ఇంతకాలం అది చెప్పేందుకు తనకు అవకాశం లేకపోయిందని కూడా పేర్కొన్నారు.ఇన్నాళ్లు తనకు అండగా నిలిచిన అభిమానులందరికీ అనుపమ కృతజ్ఞతలు తెలిపారు. అభిమానులు పంపిన ప్రతి సందేశం, ప్రతి ప్రార్థన తనకు అత్యంత క్లిష్ట సమయంలో బలాన్నిచ్చాయని పేర్కొన్నారు. తనను తిరిగి తన దగ్గరకు చేర్చినందుకు విశ్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, స్వేచ్ఛను, తన నిజమైన జీవితాన్ని సంపూర్ణంగా స్వీకరిస్తున్నానని తన సందేశాన్ని ముగించారు.
'ఇక భయాలు లేవు..
ఇదిలా ఉండగా, అనుపమ ప్రస్తుతం శర్వానంద్ హీరోగా, సంపత్ నంది దర్శకత్వంలో రూపొందుతున్న 'భోగి' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో ఆమె కందుల సులోచన రాణి అనే పల్లెటూరి యువతి పాత్రలో కనిపించనున్నారు. ప్రకృతితో మమేకమై, బలమైన వ్యక్తిత్వం కలిగిన పాత్రలో ఆమె నటిస్తున్నట్లు చిత్రబృందం ఇప్పటికే వెల్లడించింది. ఈ చిత్రంలో శర్వానంద్ 'గంగ' పాత్రలో నటిస్తుండగా, ఈ జంటను తెరపై చూసేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# రౌడీ జనార్ధన్‌పై భారీ అంచనాలు.. విజయ్‌కు కంబ్యాక్ దొరుకుతుందా?



టాలీవుడ్‌లో ఒకప్పుడు వరుస విజయాలతో యువతలో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న విజయ్ దేవరకొండ గత కొంతకాలంగా ఆశించిన స్థాయి బాక్సాఫీస్ విజయాన్ని అందుకోలేకపోయారు. స్టార్ ఇమేజ్‌లో ఎలాంటి తగ్గుదల కనిపించకపోయినా, అభిమానులు మాత్రం మరో భారీ హిట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం తెరకెక్కుతున్న రౌడీ జనార్దన్ సినిమాపై సినీ పరిశ్రమలో ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. ఈ చిత్రం విజయ్ కెరీర్‌కు మరో మలుపు తిప్పే సినిమాగా నిలుస్తుందా అనే ప్రశ్న ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తోంది.
సినీ పరిశ్రమలో ఒక మంచి సినిమా హీరో కెరీర్‌ను పూర్తిగా మార్చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. బలమైన కథ, ఆకట్టుకునే కథనం, ప్రేక్షకుల అభిరుచికి తగ్గ కమర్షియల్ అంశాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఇస్తే ఫలితం ఎలా ఉంటుందో గతంలో పలువురు స్టార్ హీరోలు నిరూపించారు. ఇప్పుడు విజయ్ దేవరకొండ కూడా అలాంటి విజయానికే ఎదురు చూస్తున్నారని సినీ వర్గాలు భావిస్తున్నాయి. రౌడీ జనార్దన్ ఆ అవకాశాన్ని అందిపుచ్చుకుంటుందా అనే ఆసక్తి నెలకొంది.ఈ సినిమా తర్వాత విజయ్ దేవరకొండ లైనప్ కూడా ఆసక్తికరంగా కనిపిస్తోంది. పలువురు ప్రముఖ దర్శకులతో కథలపై చర్చలు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకే తరహా ప్రేమకథలు లేదా యాక్షన్ చిత్రాలకు పరిమితం కాకుండా, విభిన్న కథాంశాలు, కొత్త జానర్లపై కూడా ఆయన దృష్టి సారించినట్లు సమాచారం. కెరీర్‌ను దీర్ఘకాలికంగా బలోపేతం చేసుకునే లక్ష్యంతో ప్రతి కథను జాగ్రత్తగా ఎంపిక చేస్తున్నారని టాలీవుడ్‌లో చర్చ సాగుతోంది.మరోవైపు పాన్ ఇండియా మార్కెట్‌పైనా విజయ్ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. అర్జున్ రెడ్డి సినిమాతో దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయన, ఇప్పుడు అన్ని భాషల ప్రేక్షకులను ఆకట్టుకునే కథలకే ప్రాధాన్యం ఇస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. దక్షిణాది మార్కెట్‌తో పాటు హిందీ ప్రేక్షకుల్లోనూ తన స్థాయిని మరింత బలోపేతం చేసుకోవాలనే వ్యూహంతో ముందుకు సాగుతున్నట్లు ట్రేడ్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ప్రస్తుతం టాలీవుడ్‌లో పోటీ గతంతో పోలిస్తే మరింత తీవ్రమైంది. ప్రతి స్టార్ హీరో భారీ బడ్జెట్ చిత్రాలు, పాన్ ఇండియా ప్రాజెక్టులతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న నేపథ్యంలో విజయ్ దేవరకొండకు కూడా ఒక బలమైన విజయమే అవసరమని పరిశ్రమ భావిస్తోంది. అలాంటి సమయంలో రౌడీ జనార్దన్ ఫలితం ఆయన భవిష్యత్ ప్రాజెక్టుల మార్కెట్, క్రేజ్, బిజినెస్‌పై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు.
కేవలం భారీ ఓపెనింగ్స్ సాధించడం మాత్రమే కాకుండా, కథా బలం, భావోద్వేగాలు, వినోదంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటేనే విజయ్ దేవరకొండ కెరీర్‌లో కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అందుకే ఈ సినిమాను అభిమానులతో పాటు సినీ పరిశ్రమ కూడా ఎంతో ఆసక్తిగా గమనిస్తోంది.ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, టైటిల్, సినిమా చుట్టూ నెలకొన్న అంచనాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. అయితే ఆ అంచనాలను సినిమా ఎంతవరకు అందుకుంటుందనేదే ఇప్పుడు కీలకంగా మారింది. రౌడీ జనార్దన్ విజయ్ దేవరకొండకు మరో సాధారణ సినిమాగా మిగిలిపోతుందా, లేక ఆయన కెరీర్‌ను మళ్లీ విజయాల బాట పట్టించే అసలైన కంబ్యాక్ చిత్రంగా నిలుస్తుందా అన్న ప్రశ్నకు సమాధానం సినిమా విడుదల తర్వాతే దొరకనుంది.

## ఆకట్టుకునే అందంతో

# ఆమ్నా షరీఫ్..



మ్మింగ్‌పూల్ పక్కన నిలబడి తీసుకున్న ఈ అందమైన ఫొటోలో ప్రముఖ నటి ఆమ్నా షరీఫ్ తన సహజమైన అందం, స్టైలిష్ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. లేత ఆకుపచ్చ రంగు లేస్ డిజైన్‌తో రూపొందించిన రఫుల్ దుస్తుల్లో ఆమె ఎంతో హుందాగా కనిపిస్తోంది. కళ్లకు స్టైలిష్ సన్‌గ్లాసెస్, జుట్టులో గులాబీ రంగు పువ్వు, మెడలో అందమైన నెక్లెస్‌తో ఆమె సమ్మర్ ఫ్యాషన్‌కు కొత్త నిర్వచనాన్ని ఇచ్చింది. ప్రకృతి సోయగాల నడుమ ఆత్మవిశ్వాసంతో ఇచ్చిన పోజులు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సరళమైన స్టైల్‌తోనూ ఆకర్షణీయంగా కనిపించవచ్చని ఈ ఫొటో ద్వారా ఆమ్నా మరోసారి నిరూపించింది.1982 జూలై 16న ముంబైలో జన్మించిన ఆమ్నా షరీఫ్ హిందీ టెలివిజన్, సినీ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ప్రముఖ నటి. మోడలింగ్‌తో తన కెరీర్‌ను ప్రారంభించిన ఆమె పలు ప్రముఖ సంగీత వీడియోల్లో నటించి గుర్తింపు తెచ్చుకుంది. అనంతరం 2003లో ప్రసారమైన 'కహీన్ తో హోగా' ధారావాహికలో కషీష్ సిన్హా పాత్రతో బుల్లితెరపై అడుగు పెట్టింది. 2007 వరకు విజయవంతంగా సాగిన ఈ సీరియల్ ఆమెను దేశవ్యాప్తంగా ఇంటింటికీ చేరువ చేసింది. ఆ పాత్రలో ఆమె చూపిన హావభావాలు, భావోద్వేగ నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో ఆమెకు భారీ అభిమాన వర్గం ఏర్పడింది. ెలివిజన్‌లో అగ్రనాయికగా గుర్తింపు పొందిన తర్వాత 2009లో విడుదలైన 'ఆలూ చాట్' చిత్రంతో వెండితెరకు పరిచయమైంది. అనంతరం 'ఆవో విష్ కరేన్', 'షకల్ పే మత్ జా' వంటి చిత్రాల్లో నటించి తన నటనా ప్రతిభను చాటుకుంది. 2014లో విడుదలైన సూపర్‌హిట్ చిత్రం 'ఏక్ విలన్'లో కీలక పాత్ర పోషించి మరోసారి ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఈ చిత్రంలో ఆమె నటనకు విమర్శకుల నుంచి కూడా మంచి స్పందన లభించింది.

2019లో ప్రారంభమైన 'కసౌటీ జిందగీ కే-2'లో కొమోలికా పాత్రను పోషించి మరోసారి బుల్లితెర ప్రేక్షకులను మెప్పించింది. గ్లామర్‌తో పాటు బలమైన నటనను ప్రదర్శిస్తూ ఆ పాత్రకు కొత్త అందాన్ని తీసుకొచ్చింది. ప్రతినాయక ఛాయలున్న ఆ పాత్రలో ఆమె స్టైల్, డైలాగ్ డెలివరీ, స్క్రీన్ ప్రెజెన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దీంతో కొత్త తరం ప్రేక్షకుల్లోనూ ఆమెకు మంచి ఆదరణ లభించింది.
టెలివిజన్, సినిమాలతో పాటు డిజిటల్ వేదికలపైనా ఆమ్నా తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. పాత్రకు ప్రాధాన్యం ఉన్న కథలను ఎంపిక చేసుకుంటూ విభిన్న పాత్రల్లో నటించేందుకు ఆసక్తి చూపుతోంది. నటిగా మాత్రమే కాకుండా ఫ్యాషన్ ఐకాన్‌గా కూడా ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది. సామాజిక మాధ్యమాల్లో ఆమె పంచుకునే ఫొటోలు, స్టైలిష్ లుక్స్ లక్షలాది మంది అభిమానులను ఆకట్టుకుంటుంటాయి. సంప్రదాయ దుస్తులైనా, ఆధునిక వస్త్రాలైనా సమానంగా అలరించే తీరు ఆమె ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.
వ్యక్తిగత జీవితంలో వ్యాపారవేత్త అమిత్ కపూర్‌ను వివాహం చేసుకున్న ఆమ్నాకు ఒక కుమారుడు ఉన్నాడు. కుటుంబ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ నటిగా తన ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తోంది. పని, కుటుంబం రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇస్తూ ఎంతో సమతూకంతో ముందుకు సాగుతోంది.
దాదాపు రెండు దశాబ్దాలుగా వినోద రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్న ఆమ్నా షరీఫ్ అందం, అభినయం, హుందాతనం, ఫ్యాషన్ సెన్స్‌తో నేటికీ అభిమానుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకుంటూనే ఉంది. ప్రతి కొత్త ఫొటోషూట్, ప్రతి కొత్త పాత్రతో తన ప్రత్యేకతను చాటుకుంటూ భారతీయ వినోద రంగంలో స్టైల్ ఐకాన్‌గా, ప్రతిభావంతమైన నటిగా తన స్థానాన్ని మరింత బలపరుచుకుంటోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com